RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY  తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 222 ISSUE NO : 222 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శుక్రవారం, ఫిబ్రవరి,27, 2026 Friday, February,27,2026 | పేజిలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-




ప్రధాని నరేంద్రమోడీ

## అరుదైన రికార్డు

**ఇన్‌స్టాలో వంద మిలియన్లు దాటిన ఫాలోవర్లు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి26 :భారత ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో 100 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు కలిగిన తొలి రాజకీయ నేతగా సరికొత్త రికార్డును నెలకొల్పారు. 2014లో ప్రధాని మోదీ తొలిసారిగా ఇన్‌స్టాగ్రామ్‌లో చేరారు. యువతరానికి కనెక్ట్ కావడంతో ఆయన ఫాలోవర్ల సంఖ్య నాటి నుంచీ పెరుగుతూనే ఉంది.




## న్యాయవ్యవస్థపై ఎన్‌సీఈఆర్‌టీ 'కుట్ర'

**సుప్రీంకోర్టు సంచలన తీర్పు!**

- వివాదాస్పద పాఠ్యపుస్తకంపై తక్షణ నిషేధం
- న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోందంటూ సీజేఐ ఆగ్రహం
- బేషరతుగా క్షమాపణలు చెప్పిన కేంద్రం
- అవినీతి పాఠ్యాంశంపై కఠిన చర్యలు.. మార్చి 11న తదుపరి విచారణకు ఆదేశం

డిల్లీ: న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను మంటగలిపేలా పాఠ్యపుస్తకాల్లో అభ్యంతరకర అంశాలను ప్రచురించిన ఎన్‌సీఈఆర్‌టీకి సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఎనిమిదో తరగతి సామాజిక శాస్త్ర పుస్తకంలో న్యాయవ్యవస్థలోని అవినీతిపై చేర్చిన అధ్యాయాన్ని తీవ్రంగా పరిగణించిన అత్యున్నత న్యాయస్థానం.. ఆ పుస్తకంపై తక్షణ నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది కేవలం పొరపాటు కాదు న్యాయవ్యవస్థను కించపరిచేలా చేసిన ఉద్దేశపూర్వక కుట్ర అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

బుల్లెట్ తగిలి రక్తం చిందిస్తోంది: విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అత్యంత ఘాటైన పదజాలంతో విరుచుకుపడ్డారు. "ఎన్‌సీఈఆర్‌టీ ప్రయోగించిన బుల్లెట్ తో న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోంది. కోర్టుల విశిష్ట చరిత్రను వివరించాల్సింది పోయి వ్యవస్థను అణచివేసేలా పాఠాలు రాయడం సరికాదు"




## అమెరికాలో.. కుంగిన భూమి

**గుంతలో పడిపోయిన కార్లు..**

- అమెరికాలోని ఒమాహా సిటీలో ఒళ్లు గగుర్పొడిచే దృశ్యం
- ట్రాఫిక్ సిగ్నల్ వద్ద వాహనాలు నిలిచిన సమయంలో ఘటన అదృష్టవశాత్తూ వాహనదారులకు తప్పిన ప్రమాదం

వాషింగ్టన్: అమెరికాలోని ఒమాహా నగరంలో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రోడ్డు ఉన్నట్టుండి కుంగిపోయి, భారీ గుంత ఏర్పడింది. ఆ సమయంలో రెడ్ సిగ్నల్ పడడంతో అక్కడ ఆగిన రెండు కార్లు గుంతలో పడిపోయాయి. అయితే, అదృష్టవశాత్తూ అందులోని ప్రయాణికులకు పెద్దగా గాయాలు కాలేదు. ఈ ఘటన మొత్తం అక్కడున్న సీసీటీవీ కెమెరాలలో రికార్డైంది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.




## మరో ఎన్ కౌంటర్

**భద్రతాబలగాల కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టుల మృతి**

- ఆపరేషన్ కగార్ పేరుతో మావోలపై విరుచుకుపడుతున్న బలగాలు
- ఛత్తీస్ గఢ్ ఇంద్రావతి ప్రాంతంలో మరో ఎన్ కౌంటర్
- మృతదేహాలతో పాటు భారీగా ఆయుధాల స్వాధీనం

ఛత్తీస్ గఢ్ : మావోయిస్టులపై ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిన సంగతి తెలిసిందే. గత కొన్ని నెలలుగా సాగుతున్న ఈ ఆపరేషన్ లో వందలాది మంది మావోలు మృతి చెందారు. వీరిలో అత్యంత కీలకమైన మావో లీడర్లు కూడా ఉన్నారు. ఇప్పటికే అనేక మంది మావోలు లొంగిపోయారు. పలువురు మావోలు లొంగిపోవడానికి సిద్దంగా ఉన్నారు.





## ప్రధాని మోదీ దృష్టి

**భారత్-ఇజ్రాయెల్ బంధం మరింత బలోపేతం**

- భారత్‌లో పెట్టుబడులు, తయారీ కోసం ముందుకు రావాలని ఇజ్రాయెల్ కంపెనీలకు మోదీ ఆహ్వానం
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో కలిసి అక్కడి టెక్నాలజీ ప్రదర్శనను సందర్శించిన మోదీ
- వ్యవసాయం, నీటి నిర్వహణ, ఆరోగ్యం వంటి రంగాల్లో సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని వెల్లడి
- గాలి నుంచి నీరు, రోడ్డు ప్రమాదాల నివారణ వంటి టెక్నాలజీలను పరిశీలించిన ప్రధాని




## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

- మొత్తం 45మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు
- పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 45 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో కలెక్టర్ల స్థాయిలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం జరిగింది. మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు.



## కవిత పార్టీ ఎవరికి ప్లస్.. ఎవరికి మైనస్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణలో కవితతన సొంత పార్టీనిప్రకటించేందుకు సిద్ధమవు తున్నారు. పార్టీ పేరు కూడా ఖరారయినట్లు తెలిసింది. తెలంగాణ ప్రజా జాగ్రుతి అనే పేరుతో పార్టీని ఎన్నికల సంఘం వద్ద రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిసింది. తాను తొలి నుంచి తెలంగాణ జాగృతి సంస్థ పేరిట ప్రజల్లోకి వెళ్లడంతో అదే పేరును కలిసి వచ్చేలా ఈ పేరును ఖరారు చేసినట్లు చెబుతున్నారు. తెలంగాణ జాగృతి పేరు ఇప్పటికే ప్రజల్లో బాగా నాని ఉండటంతో ఆ పేరు కలసి వచ్చేలా ఈ పేరును ఎంపిక చేసినట్లు తెలిసింది.



## ముఖ్యమంత్రి రేవంత్ గౌడ్ గీత కార్మికులకు మొండిచేయి

–గీత కార్మికుల సంక్షేమానికి 5 వేల కోట్లు కేటాయించాలని గౌడ సంఘాల డిమాండ్

చొప్పదండి,తెలంగాణ దిశ :తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాదు గీత కార్మికుల సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తున్నాడని రేవంత్ గౌడ్ అని పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ ఓ సభలో సంబోదించాడు. కానీ గీత కార్మికులకు ముఖ్యమంత్రి మొండిచేయి చూపించారని తెలంగాణా రాష్ట్రంలోని గౌడ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ కులవృత్తుల్లో కల్లు గీతకు విశిష్ట స్థానమున్నది. ఇక్కడి ప్రజల సాంస్కృతిక జీవనంలో కల్లు ఓ భాగం కావడమే అందుకు కారణం. పొలాల్లో, సేన్ల చెలకల్లో ఉండే ఎత్తైన చెట్లను ఎక్కి కల్లు గీయడం ఓ సాహసం, దినదిన గండం. అయినా వృత్తిలో భాగంగా గౌడన్నలు అనునిత్యం చెట్లు ఎక్కుతూనే ఉంటారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టు మీద నుంచి కిందకు పడి ప్రాణాలు కోల్పోవడం, దివ్యాంగులు కావడం జరుగుతుంటుంది. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన గత రెండేండ్ల కాలంలో 850 మంది చెట్ల మీద నుంచి పడితే వారిలో 160 మందికి పైగా చనిపోయారు. మరో 180 మంది శాశ్వత దివ్యాంగులుగా మారారు. మరో 500 మంది వరకూ తీవ్ర గాయాల పాలయ్యారు. అయినా రాష్ట్ర సర్కార్‌లో ఉలుకూపలుకూ లేకపోవడం విడ్డూరం. 2024 జూలైలో సీఎం రేవంత్‌రెడ్డి ఇదిగో ఇప్పుడే ఎక్స్‌గ్రేషియా కోసం ఆదేశాలిస్తున్నామంటూ చెప్పారు. 20 నెలలైనా దాని గురించి అతీగతీ లేకపోవడం గమనార్హం.



## హిమంత దూకుడు

గౌహాతి ,: అస్సాం అసెంబ్లీ ఎన్నికలు 2026 సమీపిస్తున్న వేళ, ఈ ఈశాన్య రాష్ట్రంలో రాజకీయ వాతావరణం సెగలు పుట్టిస్తోంది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలోని బీజేపీ హ్యాట్రిక్ విజయంపై కన్నేయ గా, అస్సాం గణ పరిషత్ వంటి మిత్రపక్షాల సహకారంతో బలమైన వ్యూహాలను సిద్ధం చేస్తోంది. మరో వైపు, ఉనికి చాటుకోవాలని చూస్తున్న కాంగ్రెస్, ప్రాంతీయ శక్తులతో జత కట్టి బీజేపీ కోటను బద్దలు కొట్టాలని భావిస్తోంది.ప్రస్తుత అస్సాం రాజకీ యం పూర్తిగా హిమంత బిశ్వ శర్మ చుట్టూనే తిరుగుతోంది. ముస్లిం జనాభా పెరుగుదల, బెంగాలీ ము స్లింల ప్రభావంపై ఆయన చేస్తున్న ఘాటు వ్యాఖ్యలు హిందూ ఓటు బ్యాంకును ఏకీకృతం చేస్తు న్నాయి. అస్సామీ అస్తిత్వం, హిందూత్వ ను మేళవించి ఆయన వేస్తున్న అడు గులు బీజేపీకి సానుకూల పవనా లను సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా ఉపాధి కల్పన, రోడ్ల అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాల పనులు మూడో విజయంపై ఆ పార్టీకి ధీమాను పెంచుతున్నాయి. ఇటీవల జరిగిన నియోజకవర్గాల పునర్విభజన అస్సాం రాజకీయాల్లో గేమ్ ఛేంజర్‌గా మారింది. స్థానిక అస్సామీల ప్రాబల్యం పెరిగేలా ఈ విభజన జరిగిందనే వాదన ఉంది. దీనివల్ల దాదాపు 90-100 స్థానాల్లో స్వదేశీ ప్రజల ప్రాధాన్యత పెరిగింది.

# కుషాయిగూడలో హెవీ వెహికల్ డ్రైవర్లకు ప్రత్యేక కంటి పరీక్షా శిబిరం



**కుషాయిగూడ, ఫిబ్రవరి 26, (తెలంగాణ దిశ)** :కుషాయిగూడ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ ఫేస్-2 అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈసీఐఎల్ చౌరస్తాలోని సోలిస్ ఐ హాస్పిటల్ లో గురువారం హెవీ వెహికల్ డ్రైవర్లకు ప్రత్యేక కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు ప్రమాదాలను తగ్గించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కుషాయిగూడ ఎస్ఐ ఎన్. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ భారీ వాహన డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని తెలిపారు. లారీలు, బస్సులు వంటి పెద్ద వాహనాలను నడపడానికి స్పష్టమైన దూర దృష్టి, పక్క దృష్టి, సరైన లోతు గ్రహింపు చాలా ముఖ్యమని చెప్పారు. రహదారి సూచనలు, ట్రాఫిక్ సిగ్నల్స్, అడ్డంకులను సమయానికి గుర్తించేందుకు మంచి చూపు కీలకమని పేర్కొన్నారు. క్యాటరాక్ట్, గ్లాకోమా వంటి కంటి వ్యాధులు ప్రారంభ దశలో స్పష్టమైన లక్షణాలు లేకుండానే వస్తాయని, కాబట్టి పర్యాయ కంటి పరీక్షల ద్వారా ముందుగానే గుర్తించి చికిత్స పొందవచ్చని వివరించారు. ఈ శిబిరంలో పలువురు హెవీ వెహికల్ డ్రైవర్లు పాల్గొని సోలిస్ ఐ హాస్పిటల్ వైద్య బృందం సహకారంతో కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో, ప్రజల ప్రాణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు.



# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి : పూస శ్రీనివాస్

**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 26, (తెలంగాణ దిశ)** :తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన ఉద్యమకారులకు తక్షణం న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూస శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్.వి. హోటల్‌లో నిర్వహించిన ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నిరాహార దీక్షలు, రైలు రోకోలు, జైలు శిక్షలు అనుభవించిన ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చినట్లు గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇండ్ల స్థలం, నెలకు రూ.30 వేలు పెన్షన్, హెల్త్ కార్డులు అందజేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే తెలంగాణ హైకోర్టు కూడా ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు, పెన్షన్ అందించాలనే దిశగా ప్రభుత్వానికి సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే అత్యవసర మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి ఏకగ్రీవ తీర్మానం ద్వారా ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని



పూస శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెరుగు మధు, ముప్కె జయపాల్ రెడ్డి, డి.ఎస్. మాణిక్యమ్మ, పంజాల శ్రీనివాస్ గౌడ్, కొడిమాల కృష్ణ, సుర్వి శ్రీనివాస్ గౌడ్, గొర్ల లక్ష్మణ్, ఊదరి బాలమల్లేష్ యాదవ్, బండిరాజుల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# కుషాయిగూడ పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఘన వీడ్కోలు





**కుషాయిగూడ, ఫిబ్రవరి 26, (తెలంగాణ దిశ)** :కుషాయిగూడ పోలీస్ స్టేషన్ నుండి ఎస్ఓటి మల్కాజిగిరికు బదిలీ అయిన ఏఎస్ఐ జి. అశోక్ రెడ్డి,హెడ్ కానిస్టేబుల్ అంబటి సత్యంలకు గురువారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో సహచర సిబ్బంది గులాబీ మాలలు వేసి, శాలువాలతో సత్కరించి తమ అభినందనలు తెలిపారు. కుషాయిగూడలో వారు అందించిన సేవలను అధికారులు కొనియాడారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అశోక్ రెడ్డి, సత్యం విధుల్లో క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేసి స్టేషన్ ప్రతిష్టను నిలబెట్టారని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో, శాంతి భద్రతల పరిరక్షణలో వారు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. సబ్ ఇన్ స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, వెంకన్న, సాయిలు, సునీల్ రెడ్డి, విజయ్ తదితర సిబ్బంది కూడా వారి సేవలను స్మరించుకుని, కలిసి పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. సహచరులతో ఏర్పడిన అనుబంధం, విధుల్లో చూపిన చురుకుదనం, టీమ్ స్పిరిట్ గురించి అభినందనలు తెలిపారు. బదిలీపై వెళ్తున్న అశోక్ రెడ్డి, అంబటి సత్యం తమకు అందించిన సహకారం, స్నేహానికి కృతజ్ఞతలు తెలిపారు. కొత్త బాధ్యతల్లోనూ అదే నిబద్ధతతో పనిచేస్తామని వారు హామీ ఇచ్చారు.

# బస్తీ బాటలో గుర్తించిన ప్రజా సమస్యలను పరిష్కరించాలి

**మల్లాపూర్, ఫిబ్రవరి 26, (తెలంగాణ దిశ)** :బస్తీ బాట కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మల్లాపూర్ డివిజన్ నేత నెమిలి అనిల్ కుమార్ కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి ను కోరారు. మల్లాపూర్ డివిజన్‌లో విస్తృతంగా కొనసాగుతున్న బస్తీ బాట కార్యక్రమం సందర్భంగా ప్రజల నుండి వెలువడిన ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఇందులో ముఖ్యంగా మౌలిక వసతులు, డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల పనితీరు, కాలనీల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన స్పందిస్తామని పరమేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి



సద్గుణ, మల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్, జాయింట్ సెక్రటరీ వుండం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ ఆధ్వర్యంలో స్వర్గీయ రామచందర్ కు ఘనంగా నివాళులు

**కుషాయిగూడ, ఫిబ్రవరి 26, (తెలంగాణ దిశ) :** లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కుషాయిగూడ హాస్పిటల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వర్గీయ ఎల్ఎన్. రామచందర్ స్మృతికి సంతాప సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, హాస్పిటల్ ట్రస్ట్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభలో ట్రస్ట్ చైర్మన్ లయన్ కొత్త రామారావు (ఎంజెఎఫ్), లయన్ చంద్రశేఖర్, లయన్ రవిశంకర్ రాజు, లయన్ పిళ్ళై, కొత్తపల్లి రాంబాబు, వెంకట్ రెడ్డి, లయన్ నర్సింగ్, లయన్ వెంకటపతి రాజు, లయన్ పెద్ది శ్రీను, లయన్ రాజేష్ వంశరాజ్, ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వరరావు, లయన్ మోహన్, లయన్ దాస శ్రీనివాస్, లయన్ శ్రీనివాస్ రావు



తదితరులు పాల్గొని రామచందర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన పలువురు నాయకులు రామచందర్ సేవలను స్మరించుకుంటూ, సమాజ సేవలో ఆయన చూపిన అంకితభావం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆయన లేని లోటు లయన్స్ కుటుంబానికి తీరని లోటని తెలిపారు.

# రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

## - ఆశాజ్యోతి ఉమెన్ ప్రెసిడెంట్ రమణి మల్యాల

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 26, (తెలంగాణ దిశ) :** నిజాంపేట సర్కిల్ పరిధిలోని కాలనీలలో చెదిరిపోయిన అంతర్గత రోడ్లను వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆశాజ్యోతి ఉమెన్ నెట్వర్క్ అధ్యక్షురాలు రమణి మల్యాల గురువారం నిజాంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీకి విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా భవ్యస్ ఆనందం చౌరస్తా ఆ సమీప కాలనీ పలు ప్రాంతాలలో రోడ్లు పూర్తిగా దెబ్బతినే ఉన్నాయని వాటిని మరమ్మతులు చేపట్టాలని ఆమె కోరారు. విషయం పరిశీలించి తగు చర్యలు చేపడతానని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీ హామీ ఇచ్చారు.



# ప్రగతి సెంట్రల్ స్కూల్ విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన



కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 26, (తెలంగాణ దిశ) : జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా కమిటీ నిర్వహణలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రగతి నగర్ లోని ప్రగతి సెంట్రల్ స్కూల్, ప్రగతి మెలోవరా స్కూల్ లో "భారత దేశంలో ప్రస్తుత విద్యా విధానం మారుతున్న పరిస్థితులు"అంశాలపై ప్రొఫెసర్ రామచంద్రయ్య అండ్ సైన్స్ టెంపర్ అవగాహన కలిగించేందుకు శాస్త్రీయ ఆలోచన పెంపొందించుటకు విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో టిసిఎస్ లోని ఐ మ్యాప్ ఇంచార్జీ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు కె. శంకర్ రావు, అచ్యుతరామయ్య, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిజాంపేట్ డంపింగ్ యార్డ్ లో పేరుకున్న చెత్తను తొలగించాలి

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 26, (తెలంగాణ దిశ) :** నిజాంపేట్ సర్కిల్ డబల్ బెడ్ రూమ్స్ వద్ద ఉన్న డంపింగ్ యార్డులో సుమారు 2000 టన్నుల చెత్తను వెంటనే తొలగించి స్థానికుల ఆరోగ్యలు కాపాడాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ లో హిటాచీల సహాయంతో చెత్తను ఒకవైపు తరలించి రోజువారిగా వచ్చే ఆటోలు లోపలికి వెళ్ళే విధంగా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. భవిష్యత్తులో తీసుకోవలసిన చర్యల కోసం జగద్గిరిగుట్ట డంపింగ్ యార్డ్ శాటిలైట్ ట్రాన్స ఫర్ సెంటర్ ను ఈ సందర్భంగా సందర్శించారు. భారీగా పేరుకుపోయిన చెత్తను తొలగించి స్థానికుల ఆరోగ్యాలు కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.



# పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో మల్కాజిగిరి పోలీసుల ప్రతిభ






**మల్కాజిగిరి, ఫిబ్రవరి 26, (తెలంగాణ దిశ) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత వారం రోజులుగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 4వ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారు. మొత్తం 81 పతకాలు సాధించి ఓవర్ ఆల్‌గా రెండవ స్థానాన్ని దక్కించుకున్నారు. మల్కాజిగిరి కమిషనరేట్ క్రీడాకారులు 23 బంగారు, 35 రజత, 23 కాంస్య పతకాలు గెలుచుకుని తమ సత్తా చాటారు. కఠిన పోటీల మధ్య ఈ విజయాలు సాధించడం విశేషం. ఈ సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఐపీఎస్ విజేతలకు పతకాలు అందజేసి అభినందించారు.

అనంతరం మాట్లాడుతూ, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని



తెలిపారు. గెలుపు, ఓటములు సహజమని, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో మరింత ప్రతిభ కనబరచాలని సూచించారు. మల్కాజిగిరి పోలీసుల ఈ విజయం శాఖకు గర్వకారణంగా నిలిచింది.

# జీడిమెట్ల గంపలబస్తీలో అగ్ని ప్రమాదం స్క్రాప్ దుకాణంలో చెలరేగిన మంటలు



కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 26, (తెలంగాణ దిశ) : జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని గంపల బస్తీలో ని ఓ స్క్రాప్ దుకాణంలో గురువారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి దట్టమైన పొగ అలుముకొంది. దీంతో స్థానికులు హుటా హుటిన జీడిమెట్ల పోలీసులకు, ఫైర్ కార్యాలయానికి సమాచారం అందించారు. దీంతో ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. అయితే మంటలు చెలరేగడానికి కారణాలు మాత్రం తెలియరాలేదు. ఈ విషయమై జీడిమెట్ల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జరిగిన ఆస్తి నష్టం పై ఇంకా ఒక అంచనాకు రాలేదని పోలీసులు తెలిపారు.

# ఫ్రీ మార్కెట్ అభూత కల్పన

న్యూఢిల్లీ: ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. యూరియా కొరతతో రైతులు ఎంతగా ఇబ్బందులు పడుతున్నారో చూస్తున్నాం. ఇదంతాదూరదృష్టి లోపంగానే చూడాలి. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్న ప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు.

# సంపాదకీయం

## జెన్ జెడ్ యుద్ధ భేరీ.. ఇప్పటికే 9 దేశాలు ఖతం

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జెన్ జెడ్ ట్రెండ్ మార్మోగుతోంది. 1995 నుంచి 2012 మధ్య జన్మించిన పిల్లలనే జనరేషన్ జెడ్ అని పిలుస్తుంటారు. ప్రస్తుతం ఎక్కడ చూసిన డిజిటల్ విప్లవం, అధునాతన స్మార్ట్ ఫోన్ లు, ఇంటర్నెట్, ఏఐ యుగంలో వీళ్లు జన్మించారు. ఈ తరంలో జన్మించినవారు అంతకుముందు తరాలవారి వ్యవహారశైలికి భిన్నంగా ఉంటున్నారు. తమపై ప్రభుత్వాలు ఆంక్షలు విధించడాన్ని జెన్ జెడ్ అసలు అంగీకరించడం లేదుబల్గేరియాలో నెలకొన్న రాజకీయ సంక్షోభం తీవ్ర స్థాయికి చేరుకుంది. ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో పెరిగిన అవినీతి ఆరోపణలు, దేశవ్యాప్త నిరసనల కారణంగా ప్రధాని రాసెన్ జెలియాజ్కోవ్ నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వం రాజీనామా చేసింది. జెన్-జీ దెబ్బకు మరో ప్రభుత్వం కూలిపోయింది. బల్గేరియా ప్రభుత్వం 2026 ముసాయిదా బడ్జెట్‌ను రూపొందించింది. ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ఈ బడ్జెట్‌ని రూపొందించారని యువత రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేశారు. దీంతో ప్రభుత్వం వెంటనే ముసాయిదా బడ్జెట్‌ను ఉపసంహరించుకున్నప్పటికీ.. యువత ఆందోళనలు విరమించలేదు. ప్రధాని రాసెన్ జెలియాజ్కోవ్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాకముందే.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం చేపట్టాలని నిర్ణయించింది. అవిశ్వాస తీర్మానం పార్లమెంట్‌లో ఓటింగ్‌కు రాకముందే.. తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు బల్గేరియా ప్రధాని ప్రకటించారు.ప్రతిపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై పార్లమెంట్‌లో ఓటింగ్ జరగడానికి ముందే.. నిరసనకారుల గళాన్ని గౌరవిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ప్రధాని ప్రకటించారు. ముఖ్యంగా జనవరి 1న బల్గేరియా యూరోజోన్‌లో చేరేందుకు కేవలం 20 రోజులు మాత్రమే ఉన్న కీలక తరుణంలో ఈ నిర్ణయం తీసుకోవడం దేశ రాజకీయాల్లో అనూహ్య మలుపుగా మారింది. బల్గేరియాలో జెన్ జెడ్ సాగించిన అవినీతి వ్యతిరేక ఆందోళనల ధాటికి ప్రధాని రాసెన్ జెలియాజ్కోవ్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం పతనమైంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కూడా పూర్తి కాకముందే.. తమ ప్రభుత్వం రాజీనామా చేస్తున్నట్లు ప్రధాని గురువారం ప్రకటించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షం ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరగడానికి కొద్దిసేపటి ముందే ఆయన ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు.బల్గేరియాలో అవినీతికి వ్యతిరేకంగా వేలాది మంది యువజనులు బుధవారం దేశవ్యాప్తంగా భారీ ఆందోళనలు నిర్వహించారు. ఈ నిరసనలకు ప్రధాన కారణం ప్రభుత్వం రూపొందించిన 2026 ముసాయిదా బడ్జెట్. ఈ బడ్జెట్ అవినీతిని కప్పిపుచ్చేందుకు రూపొందించిందని యువతరం తీవ్రంగా మండిపడింది. ఈ ముసాయిదాపై ఆగ్రహించిన నిరసనకారులు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం గత వారం ఈ ముసాయిదా బడ్జెట్‌ను ఉపసంహరించుకున్నప్పటికీ.. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు ఏ మాత్రం చల్లారలేదు. యువతరం అవినీతి, పాలన లోపాలపై నిరసన కొనసాగించడంతో.. జెలియాజ్కోవ్ ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి తీవ్రమైందిప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపక్షం ప్రవేశ పెట్టడం, దేశవ్యాప్త నిరసనలతో ప్రజాగ్రహం పెరగడంతో ప్రధాని రాసెన్ జెలియాజ్కోవ్.. అధికార పార్టీ నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశం అనంతరం ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం రాజీనామా చేయడమే సరైన నిర్ణయమని ప్రకటిస్తూ.. గురువారం తన రాజీనామాను సమర్పించారు. ఈ పరిణామం బల్గేరియా రాజకీయాల్లో అస్థిరతకు దారి తీసింది. పూర్తిస్థాయి ప్రజాదరణ ఉన్న ప్రభుత్వం ఏడాది కూడా పూర్తి చేయకుండానే కూలిపోవడంతో.. దేశంలో ఆకస్మిక ఎన్నికలు అనివార్యం కానున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.2020లో బొయికో బోరిస్సోవ్ ప్రభుత్వాన్ని అవినీతి వ్యతిరేక నిరసనలు కూల్చినప్పటి నుంచి దేశంలో ఏడు ఎన్నికలు జరిగాయి. ఈసారి రాజీనామా చేయకముందు కూడా జెలియాజ్కోవ్ ప్రభుత్వం ఐదు అవిశ్వాస తీర్మానాలను ఎదుర్కొని గట్టెక్కింది. రాజీనామా తర్వాత కూడా మంత్రులు కొత్త మంత్రివర్గం ఎన్నికయ్యే వరకు తమ పాత్రలను కొనసాగిస్తారని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది.జెన్ జెడ్ ఆందోళనలు బంగ్లాదేశ్ లోనూ చెలరేగాయి. అక్కడ కూడా ప్రభుత్వం కుప్పకూలింది. తాజాగా యువత చేతిలో నేపాల్ బలైంది. ఇప్పుడు పెరూ దేశం కూడా జెన్ జెడ్ ఆందోళనల ధాటికి అట్టుడుకిపోతుంది. ఈ సంవత్సరంలో మొత్తం 8 దేశాల్లో జెన్ జెడ్ ఆందోళనలు చేపట్టింది. ఇండోనేషియాలో మొదలుపెట్టి ఇప్పుడు పెరూ వరకు వచ్చింది. సెప్టెంబర్ 27 న పెరూ రాజధాని లిమాలో వేలాదిమంది యువత రోడ్లపైకి వచ్చి ఆ దేశ అధ్యక్షుడు దినా బోలువార్టే కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ క్రమంలో పోలీసులు, నిరసనకారుల మధ్య ఉద్రిక్తమైన పరిస్థితులు నెలకున్నాయి. పోలీసులు టియర్ గ్యాస్ ను ప్రయోగించారు. లాఠీఛార్జ్ చేశారు. అయితే పోలీసులపై నిరసనకారులు రాళ్లు రువ్వారు. పెన్షన్ సిస్టమ్ లో పలు మార్పులు చేసినందుకు ఈ ఆందోళనలు ప్రారంభమై నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మొదట్లో ఇండోనేషియాలో ఆ తర్వాత నెథర్లాండ్స్ లో జెన్ జెడ్ ఆందోళనలు చేపట్టింది.

# జర్నలిస్టులకు అండగా ఉంటా

## - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి - కాప్రా ప్రెస్ క్లబ్ కమిటీకి అభినందనలు వెల్లువ





**కాప్రా, ఫిబ్రవరి 26, (తెలంగాణ దిశ) :** జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతుగా రాజీలేని కృషిని కొనసాగిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం గురువారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ హితం కోసం కాప్రా ప్రెస్ క్లబ్ జర్నలి స్టులు సాగిస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసిం చారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ సలహాదారులు ఎంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, ఉపాధ్యక్షులు దిలీప్ కుమార్, యావాపురం రవి, దొమ్మాటి కిరణ్ కుమార్, గార్లపాటి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, సంయుక్త కార్యదర్శులు డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కోశాధికారి రామచంద్రమూర్తి, కార్యవర్గ సభ్యులు గంగి కృష్ణ, గోవిందుకుంట్ల ఆంజనేయులు, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



**జర్నలిస్టుల సంక్షేమ కోసం కృషి చేస్తా**
**ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి**

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఆయన ఘనంగా సన్మానించారు. గత దశాబ్ద కాలంగా కాప్రా జర్నలిస్టులతో ఎంతో సత్సంబంధాలు ఉన్నాయని అన్నారు. కాప్రాలో ప్రెస్ క్లబ్ నిర్మాణానికి కృషి చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో జర్నలిస్టుల సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సలహాదారులు ఏంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, ఉపాధ్యక్షులు దిలీప్ కుమార్, యావాపురం రవి, దొమ్మాటి కిరణ్ కుమార్, గార్లపాటి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, సంయుక్త కార్యదర్శులు డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కోశాధికారి రామచంద్రమూర్తి, కార్యవర్గ సభ్యులు గంగి కృష్ణ, గోవిందు కుంట్ల ఆంజనేయులు, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం**
**మాజీ కార్పొరేటర్ స్వర్ణ రాజ్ శివమణి**

సమాజంలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ, వ్యవస్థలోని లోపాలను ఎండగట్టడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని కాప్రా డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వర్ణ రాజ్ శివమణి అన్నారు. కాప్రా ప్రెస్ క్లబ్ నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్వర్ణ రాజ్ మాట్లాడుతూ, పాత్రికేయ వృత్తిలో ఉన్న సవాళ్లను ప్రస్తావిస్తూ జర్నలిస్టుల సేవలను ప్రశంసించారు. సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ, విలువలతో కూడిన వార్తలను అందించాలని నూతన కమిటీకి సూచించారు. ప్రెస్ క్లబ్ సభ్యుల సంక్షేమం కోసం మరియు జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సలహాదారులు ఏంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, అధ్యక్షుడు మెరుగు చంద్రమోహన్, ఉపాధ్యక్షులు దిలీప్ కుమార్, యావాపురం రవి, దొమ్మాటి కిరణ్ కుమార్, గార్లపాటి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, సంయుక్త కార్యదర్శులు డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కోశాధికారి రామచంద్రమూర్తి, కార్యవర్గ సభ్యులు గంగి కృష్ణ, గోవిందుకుంట్ల ఆంజనే యులు, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**పాత్రికేయుల సంక్షేమం,**
**ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి పూర్తి సహకారం..**
**కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్**

పాత్రికేయుల సంక్షేమం, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తానని కాప్రా సర్కిల్ డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్ అన్నారు. గురువారం కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ సభ్యులు డాక్టర్ ఏఎస్ రావు నగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా కేశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ.. తాను గతంలో జర్నలిస్టుగా పనిచేసిన అనుభవం ఉన్నందున పాత్రికేయుల సాధక బాధలు తనకు బాగా తెలుసన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి తన వంతు కృషి ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రెస్‌క్లబ్ అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సలహాదారులు ఏంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, అధ్యక్షుడు మెరుగు చంద్రమోహన్, ఉపాధ్యక్షులు దిలీప్ కుమార్, యావాపురం రవి, దొమ్మాటి కిరణ్ కుమార్, గార్లపాటి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, సంయుక్త కార్యదర్శులు డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కోశాధికారి రామచంద్రమూర్తి, కార్యవర్గ సభ్యులు గంగి కృష్ణ, గోవిందుకుంట్ల ఆంజనేయులు, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపు నూరు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఆ పిల్లల కలలు నెరవేరేనా?

బాంబు మోతలు, కుప్పకూలుతున్న భవనాలు, గగ్గోలు పెడుతున్న ప్రజలు, భయంతో పిల్లలహాహాకారాలు.. శవాల దిబ్బలు,రక్తం మడు గులు, తెగిపడిన అవయవాలు.. ఇంతటి భీకర పరిస్థితులకి స్వస్తి పలుకుతూ ఇజ్రాయిల్,గాజా పాలకుల మధ్యఇటీవల శాంతి (సీజ్‌ఫైర్) ఒప్పందం కుదిరింది. ఈ సమయంలో అక్కడి పిల్లలు దీని గురించి ఏమనుకుంటున్నారు? వారి ఆశలు, భయాలు ఏంటి? తాజా పరిస్థితుల్లో ఆ చిన్ని బుర్రల్లో మెదులుతున్న కొత్త ఆశలు ఏంటి?

ఈ రెండేళ్లల్లో ఇజ్రాయిల్ దాడులకి గాజాలో 20 వేల మంది పిల్లలు అశువులుబాశారు. సుమారు 60 వేల మంది పిల్లలు అవయవాలు కోల్పోయి జీవచ్ఛవాలుగా మారారు. 12 లక్షల మంది పిల్లలు ఆకలితో అలమటించారు. ఇంకా కళ్లు చెమర్చే, ఒళ్లు గగుర్పాటు చెందే దారుణాలు అక్కడ అనేకం జరిగాయి. ఇప్పుడు అక్కడ చాలామంది పిల్లలకు ఇల్లు లేదు. అమ్మానాన్న లేరు. తోబుట్టువులు లేరు. స్కూళ్లు లేవు. కుటుంబమే లేదు. ఎటు చూసినా నిరాశ, విషాదం తాండవిస్తోంది. ఈ పరిస్థితుల్లోనే ఆ పిల్లలు నిత్యం శాంతి కోసం కలలు గన్నారు.

రాషా అబ్దుల్లా.. యుద్ధం వేళ రాషా ఉత్తర గాజా నుంచి సురక్షిత ప్రాంతానికి చేరుకుంది. 12 ఏళ్ల ఈ పాప తాజా పరిస్థితులపై ఇలా మాట్లాడింది. 'సీజ్‌ఫైర్ ఒప్పందం కుదిరిందని విన్నప్పుడు ఎంత సంతోషమేసిందో మాటల్లో చెప్పలేను. ఇదంతా ఆగిపోతుంది అన్న ఆలోచన రాగానే ఏదో అద్భుతం జరిగినట్లు అనిపించింది. ఎందుకంటే ఇప్పుడు మేం మా ఇళ్లకి వెళ్లిపోతాం. మా నగరానికి చేరుకుంటాం. మేం పుట్టి, పెరిగిన ప్రాంతాన్ని విడిచిపెట్టి ఇక్కడ తలదాచుకున్నాం. మాకు అక్కడ ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. అవన్నీ ఇప్పటివరకు మిస్ అయ్యాం. 'ఉత్తర గాజా వైపు త్వరలోనే ప్రయాణిస్తాం' అన్న ఆలోచన



ప్రతి రోజూ వచ్చేది. అది ఇప్పుడు నిజమయ్యింది. యుద్ధానికి, మారణహోమానికి ఎక్కడ బలౌతానో అని చాలా భయమేసింది. కానీ అవేమీ నాకు జరగలేదు. 'మా ఇంటికి ఎప్పుడు వెళతానో' అని ఎదురుచూడడమే ఇప్పుడు నా ఆశ' అంటోంది. రాషా లాంటి చిన్నారులు అక్కడ కోకొల్లలు. సర్వం కోల్పోయిన వారు కొందరు. జీవితం మీద కొత్త ఆశలు చిగురిస్తున్న వారు మరికొందరు.

అబ్బౌద్ అల్‌నూన్.. 13 ఏళ్ల అబ్బౌద్ ఉత్తర గాజా నుంచి ఈ ప్రాంతానికి వచ్చాడు. యుద్ధం గురించి తను ఏమన్నాడంటే.. 'యుద్ధ సమయంలో చాలా కష్టంగా అనిపించింది. ఈ యుద్ధంలో నా తమ్ముడ్ని కోల్పోయాను. దాడుల్లో నా ప్రియమైన వారు చాలామంది చనిపోయారు. తాజా ఒప్పందాలతో ఇప్పుడు మేం మా ఇళ్లకి, స్కూలుకి వెళతాం. నేనైతే పెద్దయ్యాక విదేశాలకి వెళతాను. నాకైతే ఈ రక్తపాతం ఆగినందుకు చాలా సంతోషంగా ఉంది' అంటున్నాడు.

తాజ్ అల్ ఖయద్.. 13 ఏళ్ల తాజ్, ఘర్షణల్లో సర్వం కోల్పోయిన సబ్రా ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చింది. తను ఏమన్నదంటే.. 'యుద్ధానికి ముందు నేను బాగా చదువుకుని డాక్టరుని కావాలనుకున్నాను. కానీ ఈ యుద్ధం నన్ను చదువుకి దూరం చేసింది. ఇది సాఫీగా సాగిపోతున్న మా విద్యని చెల్లాచెదురుచేసింది. చదువు ఒక్కటే కాదు.. ఈ యుద్ధం మాకు సంబంధించిన అన్నింటికీ అంతరాయం కలిగించింది. ఇప్పుడు నేను మళ్లీ నా గాజా నగరానికి వెళ్తున్నాను. ఆ ఊహ ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. అక్కడికి వెళ్లాక మా కుటుంబాన్ని కలుస్తాను. ఫ్రెండ్స్‌ని చూస్తాను' అంటోంది. హమ్జ అల్ సౌశి.. అజ్ జవేదా నుంచి హమ్జ ఇక్కడికి వచ్చాడు. కుటుంబ అవసరాల కోసం వీధుల్లో తిరుగుతూ పిస్తా పప్పులు అమ్ముకుంటున్నాడు. యుద్ధం తన కుటుంబానికి ఎంతటి నష్టం కలిగించిందో తను ఇలా చెప్పాడు. 'నేను నా బంధువులని చాలామందిని ఈ యుద్ధంలో కోల్పోయా ను. స్నేహితులని కూడా పోగొట్టుకున్నాను. నేను స్కూలుకి తిరిగి వెళ్లినా నా ఫ్రెండ్స్ చాలామందిని కలుసుకోలేను. ఎందుకంటే వాళ్లల్లో ఎంతమంది బతికివున్నారో నాకు తెలియదు. నా జీవితంలో ఇప్పటివరకు ఉన్న ప్రతి సంతోషాన్ని ఈ యుద్ధం చెరిపేసింది. యుద్ధానికి ముందు డాక్టరు చదవాలని ఆశపడ్డాను.

ఇప్పటికైనా ఇది ముగిసింది. ఇక నా కలని నెరవేర్చుకునేందుకు కష్టపడ తాను. ఇంకా నాకిష్టమైన రొట్టెలు, మాంసం, పళ్లు తింటాను. ఇప్పుడు నేను ఈ ప్రపంచంలో ఉన్న ఎంతోమంది పిల్లలు జీవించినంత స్వేచ్ఛగా జీవించాలని కోరుకుంటున్నాను' అంటున్నాడు. యుద్ధం వేళ.. ఇంట్లో ఉండడం, అమ్మానాన్నతో కలిసి ఉండడం, స్నేహితులతో ఆడుకోవడం, స్కూలుకి వెళ్లడం, బంధువులతో గడపడం.. వంటి సాధారణమైన విషయాలకి కూడా గాజా పిల్లలు దూరమయ్యారు.

# అర్థం చేసుకోకుండా చదివితే ఏమవుతుంది?



అర్థం చేసుకోకుండా చదివితే ఏమవుతుంది? కొంప కొల్లేరవుతుంది. చేసిన కష్టమంతా వ్యర్థమవుతుంది. వల్లెవేత చదువుల వల్ల ఎలాంటి ఫలితాలు వస్తున్నాయో చూస్తున్నాం గదా. ప్రపంచ దేశాల్లో మన స్థానం ఎక్కడ వుందో అర్థం కావడం లేదా? ఇప్పటివరకు మనకు వచ్చిన నోబెల్ అవార్డులు ఎన్ని? మనం ఎన్ని కొత్త ఆవిష్కరణలు చేశాము? ప్రతి ఏటా మనం సంపాదిస్తున్న పేటెంట్లు ఎన్ని? ప్రపంచ దేశాల్లో మన విశ్వవిద్యాలయాల స్థానం ఎక్కడీ చదువులు పూర్తి చేసుకుని బయటకు వచ్చే వారిలో నైపుణ్యంగలవారు ఎంతమంది? ఉత్తమమైన చదువుల కోసం విదేశాల్లో చదివే వారిలో భారతీయులు ఎంతమంది? అందుకోసం ఎన్ని లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నారు? నేరాలు, ఘోరాలు, మూఢ నమ్మకాలు ఇవన్నీ ఎందుకు పెరిగిపోతున్నాయి? విదేశాల్లో రాణిస్తున్న భారతీయులు స్వదేశాల్లో ఎందుకు రాణించడం లేదు? ఇలా చెప్పుకుంటూ పోతే, అర్థం లేని మన చదువుల వల్ల ఈ దేశం ఎంత నష్టపోతోందో తలచుకుంటే గుండెలు తరుక్కుపోతాయి. కాలాన్ని, వయస్సును, డబ్బును ఖర్చు చేసి మన పిల్లలు చదువుల పేరుతో చేస్తున్న కృషి బూడిదలో పోసిన పన్నీరవుతుంటే చూసి ఎలా తట్టుకోగలుగుతున్నాం? జరుగుతున్న నష్టం ఎంతో ఇప్పటికీ అర్థం కావడం లేదా?అర్థం చేసుకోవడం అంటే: నిజంగా అర్థం చేసుకోవడం ఎలా వుంటు ందో ఒకసారి చూద్దాం. అర్థం చేసుకునేటప్పుడు మనసులో ఎలాంటి భావాలు కలుగుతాయో, సందేహాలు వస్తాయో, ఎలాంటి మార్పు కలుగుతుందో చూద్దాం.

# గంటకు 12 నిమిషాలు మాత్రమే యాడ్స్

## టీవీ ప్రసార సంస్థలకు ట్రాయ్ ఆదేశాలు జారీ
## ఆదాయం తగ్గి మనుగడ కష్టమవుతుందని టీవీ చానళ్ల యాజమాన్యాల ఆందోళన



చెన్నై, : టెలివిజన్ ప్రసారాల కంటెంట్‌ని నియంత్రించే ప్రయత్నంలో భాగంగా టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) టెలివిజన్ ప్రసార సంస్థలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. గంటకు 12 నిమిషాలకు మించి వ్యాపార ప్రకటనలను ప్రసారం చేయరాదన్న నిబంధనకు తప్పనిసరిగా కట్టుబడి ఉండాలని ట్రాయ్ ఆదేశించింది. ఈ వ్యవహారం కోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ పరిమితి నిబంధనను అమలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ నిబంధన ఇప్పటికీ అమల్లో ఉందని, దీన్ని ప్రసార సంస్థలు పాటించక తప్పదని ట్రాయ్ అధికారి ఒకరు తెలిపారు. టీవీ ప్రసార సంస్థలపై కఠిన చర్యలు వద్దని మాత్రమే ఢిల్లీ హైకోర్టు ఆదేశించి స్టే ఇచ్చిందే తప్ప గంటకు 12 నిమిషాల వ్యాపార ప్రకటనల పరిమితిపై ఎటువంటి స్టే ఇవ్వలేదని ఆ అధికారి చెప్పారు. ట్రాయ్ నిబంధనల ప్రకారం కూడా గంటకు 10 నిమిషాల వాణిజ్య ప్రకటనలు, మరో 2 నిమి షాలు సొంత చానెల్ ప్రచారానికి సంస్థలు సమయం కేటాయించాల్సి ఉంటుంది. ట్రాయ్ కొత్త నిబంధనలు టెలివిజన్ ప్రసార మీడియాకు చెందిన ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ గణాంకాలు సూచిస్తున్నాయి. చందాలు, వాణిజ్య ప్రకటనల ఆదాయం పైనే కంపెనీలు మనుగడ సాగిస్తున్నాయి. ఇలాంటి సమయలో వాణిజ్య ప్రకటనల సమయాన్ని తగ్గించడం వల్ల ఆదాయం మరింత పడిపోతుందని సీనియర్ బ్రాడ్‌కాస్టింగ్ ఎగ్జిక్యూటివ్ ఒకరు ఆందోళన వ్యక్తం చేశారు.

# 25 ఎకరాలు కేటాయించేందుకు ప్రభుత్వం అనుమతి

**తిరుమల,తెలంగాణ దిశ :**కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి వైభవాన్ని ఈశాన్య భారతదేశంలో మరింత విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. గువాహటి నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రం నిర్మాణం సాకారం కానుంది. అసోంలో అద్భుత దేవాలయ నిర్మాణానికి అక్కడి ప్రభుత్వం సహకారం అందించనుంది. ఆలయ నిర్మాణానికి తొలుత నిర్ణయించిన 10.8 ఎకరాల భూమికి బదులుగా 25 ఎకరాల భూమిని కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం నిర్ణయించింది. అస్సాం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన సంప్రదింపుల అనంతరం ఈ కీలక నిర్ణయం వెలువడిం ది. గువాహటి సమీపంలోని కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో 10.8 ఎకరాల భూమిని కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం గతంలోనే అంగీకారం తెలిపింది. అయితే డిసెంబర్ 7న అస్సాం ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి కేకే ద్వివేది టీటీడీ ఛైర్మన్‌కు లేఖ రాస్తూ గువాహటిలోని గర్చుక్ ప్రాంతంలో ఇప్పటికే ఉన్న శ్రీవారి ఆలయం మరియు సాంస్కృతిక సముదాయం నిర్వాహకుల సూచనలను ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో టీటీడీ శ్రీ వేంకటేశ్వర ఆలయం నిర్మిస్తే, అక్కడ ఉన్న ఆలయ ప్రయోజనాలకు భంగం కలగవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని అస్సాంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సిల్చార్ లేదా డిబ్రూగఢ్ నగరాల్లో ఏర్పాటు చేయాలని అస్సాం సీఎం అదనపు ప్రధాన కార్యదర్శి సూచించారు. ఈ విషయా న్ని టీటీడీ ఛైర్మన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన ఈనెల 18న అస్సాం ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మకు లేఖ రాశారు. దేశంలోని ప్రతి రాష్ట్రం మరియు కేంద్రపాలిత ప్రాంతంలో కనీసం ఒక శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని స్థాపించడం ద్వారా హిందూ సనాతన ధర్మం, శ్రీవేంకటేశ్వర స్వామి వారి మహిమను విస్తరించాలన్నది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు టీటీడీనిబద్ధతగా ఆ లేఖలో పేర్కొన్నారు. ఆంధప్రదేశ్ కొత్త రాజధాని అమరావతిలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 25 ఎకరాల భూమిని కేటాయించిన విషయాన్ని అస్సాం ముఖ్యమంత్రికి గుర్తు చేస్తూ, సిల్చార్ లేదా డిబ్రూగఢ్ బదులుగా అస్సాం రాజధాని గువాహటిలోనే టీటీడీకి 25 ఎకరాల భూమి కేటాయించాలని సీఎం చంద్రబాబు కోరారు. ఈశాన్య భారతదేశానికి గువాహటి ప్రధాన కేంద్రంగా ఉన్నందున, భక్తుల సౌకర్యాలు, నిత్య అన్నదానం వంటి ధార్మిక కార్యక్రమాలతో కూడిన దివ్యక్షేత్రాన్ని ఏర్పాటు చేయడానికి సుమారు 25 ఎకరాల భూమిని కేటాయించాలని సిఫార్సు చేశారు. అలాగే ప్రతిపాదిత స్థలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అస్సాం ప్రభుత్వం ఆర్థిక సహకారం కూడా అందించాలని ఏపీ సీఎం తన లేఖలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చేసిన సూచనలకు సానుకూలంగా స్పందించిన అస్సాం ముఖ్యమంత్రి గువాహటిలోనే టీటీడీకి 25 ఎకరాల భూమిని కేటాయించేందుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. అలాగే ప్రతిపాదిత ప్రాజెక్టు అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని కూడా అందించేందుకు అంగీకరించారు. ఈ అంశాన్ని సౌహార్దపూర్వకంగా పరిష్కరించినందుకు ఆంధ్ర ప్రదేశ్ , అస్సాం రాష్ట్రాల ముఖ్యమంత్రులకు టీటీడీ ఛైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. భూమి కేటాయింపునకు సంబంధించిన విధివిధానాలను పూర్తి చేసి,ఈశాన్య భారతదేశంలో తొలి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించేందుకు అస్సాం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటామని తెలియజేశారు.

### 45 రోజులుగా రోడ్డు వేసి మరీ అక్రమంగా ఇసుక తవ్వకాలు..!

**మెదక్,తెలంగాణ దిశ :** మెదక్ మండలం సంగాయిగూడ తండా హల్దీ వాగులో అధికార పార్టీ నాయకులు రోడ్డు వేసి మరీ 45 రోజులుగా అక్రమంగా యధేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. హల్దీ వాగు నుంచి ఇసుక తవ్వకాలు చేపడుతూ జహీరాబాద్, బీదర్, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో వాగులో క్వారీ ఏర్పాటు చేసుకున్న ప్రాంతాన్ని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం పద్మా దేవేందర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పరిశీలించారు. వారి వెంట ఎమ్మెల్సీయాదవ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, నాయకులు కంఠరెడ్డి తిరుపతి రెడ్డి, మెదక్ మండల పార్టీ అధ్యక్షుడు ఎం అంజ గౌడ్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సమాజం బాగుపడాలని





**హైదరాబాద్,తెలంగాణ దిశ :** సమాజం పట్ల కొంతమంది ఎంతో బాధ్యతగా ఉంటారు. తమిళనాడు తిరుచ్చికి చెందిన విజయ్ కుమార్ అలాంటివారే. చనిపోయిన వారికి గౌరవం, జీవించి వున్న వారికి జ్ఞానం, సంస్కృతిని కాపాడడం ఆయన దినచర్యల్లో భాగం.ఒకే వ్యక్తి ఇన్ని రకాల పనులు చేయడం చూస్తే ఆశ్చర్యమేస్తుంది. కానీ విజయ్ కుమార్ దాన్ని సాధ్యం చేసి చూపిస్తున్నారు. ఆయన అడుగుజాడల్లో భార్య, కూతురు కూడా కలిసి నడవడం చూసి ఎంతోమంది స్ఫూర్తిని పొందుతున్నారు.విజయ్ కుమార్‌కి 50 ఏళ్లు. ఆయన తన 25 ఏళ్ల నుండే పుస్తకాలు సేకరించడం, గ్రంథాలయం నిర్వహించడం విధిగా చేస్తున్నారు. పుస్తకాలు చదువుకోవాలనుకున్న వారికి ఉచితంగా వాటిని పంపిణీ చేస్తారు. గ్రంథాలయానికి వచ్చి చదువుకునే వారి దగ్గర నుండి కూడా ఏవిధమైన రుసుము వసూలు చేయరు. పుత్తూరులో ఈయన నిర్వహించే గ్రంథాలయంలో 25 వేల పుస్తకాలు ఉన్నాయి. పుస్తకాలని విజయ్ కుమార్ ఎంతలా ప్రేమిస్తారో ఆయన మాటలను బట్టే అర్థమవుతుంది. 'పుస్తకాలు లేని ఇల్లు కిటికీలు లేని గోడ వంటిది. తెరిచిన గ్రంథాలయాలు జైళ్ల గోడలను మూసి వుంచుతాయి. మంచి పుస్తకాలు చదవడం జ్ఞానాన్ని మెరుగుపరుచుకోవడంతో సమానం' వంటి మాటలు తరచూ విజయ్ కుమార్ అంటుంటారు. పుస్తక జ్ఞానాన్ని ప్రజలకు ఇంతలా చేరువ చేస్తున్న అతని కృషికి ప్రశంసలు, అవార్డులు కూడా దక్కాయి.

సాధారణంగా చనిపోయిన వారి ఇంటికి వెళ్లినా, శ్మశానం వరకు వెంట నడిచినా చాలా ఇళ్లల్లో గొడవ చేస్తారు. విజయ్ కుమార్ ఇంట్లో వాళ్లు మాత్రం అలా కాదు. ఆయన భార్య చిత్ర, కూతురు కీర్తన అనాథలకి అతను చేసే అంత్యక్రియల్లో భాగమవుతారు. రోడ్ల మీద, బస్టాండ్‌లు, రైల్వే స్టేషను, నదీతీరాల్లో అనాథలుగా పడిఉన్న శవాలకి విజయ్ కుమార్ ఎంతో శ్రద్ధగా చివరి క్రతువులు నిర్వహిస్తారు. కోవిడ్ సమయంలో కూడా కుటుంబ సభ్యులు కూడా దగ్గరికి రాని మృతదేహాలకు ఈ కుటుంబం అంత్యక్రియలు చేసింది. 'ఈ పని చేస్తున్నందుకు ఎంతోమంది నిందించారు. అయినా మా పని ఎప్పుడూమానలేదు' అని చిత్రచెబుతున్నారు. గ్రంథాలయం, అనాథశవాల అంత్యక్రియలు నిర్వహించే విజయ్ కుమార్‌కి తమిళ సంస్కృతి చిహ్నాలను కాపాడడం చాలా ఇష్టం. పురాతన వస్తు సముదాయాలు నిండిన ఆయన ఇల్లు ఒక చిన్నసైజు మ్యూజియంలా ఉంటుంది. దీనిగురించి ఆయన ఇలా అంటున్నారు. 'తిరుచ్చిలోని అన్ని గ్రామాలు తిరుగుతాను. కొన్ని సార్లు జిల్లా నుండి బయటికి కూడా వెళతాను. నేను సేకరించిన వస్తువులను తమిళం, ఇంగ్లీషు భాషల్లో డాక్యుమెంటరీ కూడా చేశాను. పరిశోధనల కోసం కాలేజీ విద్యార్థులు ఇక్కడికి వస్తుంటారు. పురాతన కాలంలో వాడిన నాగళ్లు, మట్టి కుండలు, ధాన్యం సేకరణ వస్తువులు, వెదురుబుట్టలు, వ్యవసాయరంగంలో వాడే వివిధ పనిముట్లు, నాణేలు, కరెన్సీ కాగితాలు వంటి వన్నీ సేకరిస్తాను' అని విజయ్ కుమార్ చెప్పారు.న్యాయవాద వృత్తిలో ఉన్న చిత్ర, ఎల్ఎల్‌బి చదువుతున్న కీర్తన తమ బిజీ లైఫ్‌లో కూడా విజయ్ కుమార్‌కి అండగా నిలవడం వెనుక ఒకే ఒక్క ఉమ్మడి లక్ష్యం దాగుంది. అది సమాజం పట్ల బాధ్యతగా ఉండడం.

# డీ లిమిటేషన్ కు లైన్ క్లియర్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను 300 డివిజన్లను పెంచడంపై దాఖలైన 80 పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టి వేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో జోక్యం చేసుకోలేమని తెలిపింది. అభ్యంతరాలు తెలిపేందుకు ఇచ్చిన గడువు ముగిసిందని హైకోర్టు గుర్తు చేసింది. దీంతో ప్రభుత్వం గ్రేటర్ ను 300వార్డులుగా విభజించడానికి అడ్డంకులు తొలగిపోయినట్లయింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరిస్తూ, వార్డుల సంఖ్యను 150 నుండి 300కు పెంచుతూ ప్రభుత్వం డీలిమిటేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజన అశాస్త్రీయంగా ఉందంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. పిటిషన్లపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి, తొలుత 300 వార్డుల జనాభా వివరాలు, మ్యాప్‌లను 24 గంటల్లో పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని ఆదేశించారు. అయితే, దీనిపై ప్రభుత్వం అప్పీలుకు వెళ్లడంతో డివిజన్ బెంచ్ ఈ ఉత్తర్వులను పాక్షికంగా సవరించింది. కేవలం పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేసిన వార్డులు ముఖ్యంగా వార్డు నెం. 104 - షా అలీ బండా, 134 - లంగర్ హౌజ్ వివరాలు మాత్రమే బహిర్గతం చేయాలని స్పష్టం చేసింది. వార్డుల విభజనపై ప్రజలు తమ అభ్యంతరాలను సమర్పించడానికి హైకోర్టు అదనపు సమయం కేటాయించింది. తొలుత డిసెంబర్ 17తో ముగియాల్సిన గడువును కోర్టు డిసెంబర్ 19 వరకు పొడిగించింది. ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ డీలిమిటేషన్ అనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఇందులో కోర్టుల జోక్యం పరిమితంగా ఉండాలని వాదించారు. కేంద్ర సెన్సస్ కమిషనర్ ఆదేశాల ప్రకారం డిసెంబర్ 31, 2025 నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని, అందుకే వేగంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేశామని, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.డీలిమిటేషన్ పై ప్రభుత్వానికి చాలా అభ్యంతరాలు వచ్చాయి. ఒకే వార్డు రెండు, మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోకి వస్తోందని కొందరు ఫిర్యాదు చేశారు. కొన్ని వార్డుల్లో 18 వేల జనాభా ఉంటే, మరికొన్నింటిలో 70 వేల వరకు ఉండటంపై కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హయత్ నగర్ వంటి ప్రాంతాల్లో చారిత్రక కట్టడాలు ఒక వార్డులో, ఆ ప్రాంత పేరుతో ఉన్న మరో వార్డు వేరే చోట ఉండటంపై స్థానికులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు అభ్యంతరాలను స్వీకరిస్తూనే, మరోవైపు కోర్టు కోరిన వార్డుల మ్యాప్‌లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. డిసెంబర్ 31లోగా తుది నివేదిక సిద్ధం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దానికి సంబంధించి కోర్టు వద్ద అడ్డంకులు అన్నీ తొలగిపోయినట్లయింది.

## రెండో బిడ్డ ఉంటే ప్రభుత్వ ప్రోత్సహకం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఆంధ్రప్రదేశ్ లో ఇకపై రెండో శిశువుకు జన్మనిస్తే ప్రోత్సాహకాలు ఇవ్వాలని చంద్రబాబు ప్రభుత్వం యోచిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో జనాభా తగ్గుతుండటంతో ఈ రకమైన నిర్ణయాన్ని త్వరలోనే చంద్రబాబు తీసుకుంటారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. దేశంలోనే కాదు.. ఏపీలోనూ అందులో దక్షిణాది రాష్ట్రాల్లో గత కొన్నిరోజులుగా జనాభా సంఖ్య తగ్గుతూ వస్తుంది. దీంతో ఏపీ ప్రభుత్వం రెండో బిడ్డను కంటే ప్రోత్సాహకాలు ఇచ్చే యోచనలో ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ లో వృద్ధుల జనాభా పెరగడంతో పాటు సంతానోత్పత్తి రేటు తగ్గుదల ఆందోళన కలిగిస్తుంది.ఇదే విషయాన్ని చంద్రబాబు పదే పదే అనేక బహిరంగ సభల్లో ప్రస్తావిస్తున్నారు. ప్రతి వారు ఇద్దరు లేదా ముగ్గురు సంతానాన్ని కలిగి ఉండాలని చెబుతూ వస్తున్నారు. అయితే పెరుగుతున్న ఖర్చులు, ఆర్థిక భారం దృష్ట్యా చాలా మంది సింగిల్ శిశువుకే పరిమితమవుతున్నారు. దీంతో పాటు సంతాన సాఫల్యత పెంచేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫెర్టిలిటీ సెంటర్లను కూడా ఏర్పాటు చేయాలన్న ఉద్దేశ్యంలో ఉన్నట్లు ప్రచారం సాగుతుంది. జనాభా నియంత్రణ నుంచి జనాభా సుస్థిరత వైపు ప్రభుత్వ పాలసీని మార్చుకుని చంద్రబాబు ఆ దిశగా త్వరలోనే కీలక ప్రకటన చేయనున్నారని తెలిసింది. ఆంధ్రప్రదేశ్‌లో జనాభా సంక్షోభం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది.రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు ఆందోళనకరంగా పడిపోవడంతో, భవిష్యత్తులో తలెత్తే తీవ్ర పరిణామాలను నివారించేందుకు ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఫ్రాన్స్, హంగేరీ వంటి దేశాల్లో అమలు చేస్తున్న తరహాలో 'రెండో బిడ్డను కనేవారికి' ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఓ అధికారి వెల్లడించారు. ఇటీవల అమరావతిలో జరిగిన 5వ కలెక్టర్ల సదస్సులో ఈ ఆందోళనకరమైన గణాంకాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ బయటపెట్టారు. జాతీయ సగటు 28.4 ఏళ్లతో పోలిస్తే, ఏపీలో సగటు వయసు 32.5 ఏళ్లుగా ఉందని, ఇది రాష్ట్రం వేగంగా వృద్ధాప్యం వైపు వెళ్తోందనడానికి సంకేతమని ఆయన వివరించారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5కు పడిపోయిందని, ఇది సాధారణంగా ఉండాల్సిన 2.1 కంటే చాలా తక్కువని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ. పనిచేయని వయసు జనాభా పెరుగుతోంది. ఇకపై పిల్లల్ని కనేలా కుటుంబాలను ప్రోత్సహించడంపైనే మన దృష్టి పెట్టాలనడం దీనిని సూచిస్తుంది

# ఇండియా వైపు అమెరికన్ కంపెనీలు

ఒకప్పుడు అమెరికా కంపెనీలు భారతదేశంలో పెట్టుబడి పెట్టడానికి అంతగా ఆసక్తిని చూపించేవి కాదు. ఒకవేళ పెట్టుబడులు పెట్టినప్పటికీ అనేక రకాల షరతులతో ఇక్కడికి వచ్చేవి. మనదేశంలో స్థిరమైన ప్రభుత్వాలు ఏర్పడకపోవడం వల్ల విదేశీ పెట్టుబడిదారులలో నమ్మకం ఉండేది కాదు. దీంతో కంపెనీలు ఏర్పాటు కాకపోవడంతో దేశానికి అంతగా ఆదాయం ఉండేది కాదు. 2014 నుంచి ఇప్పటివరకు దేశంలో స్థిరమైన ప్రభుత్వాలు ఏర్పడటం వల్ల పెట్టుబడిదారుల్లో నమ్మకం కలిగింది. దీనికి తోడు ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు కంపెనీలకు అనుకూలంగా ఉంటున్నాయి. ముఖ్యంగా అమెరికన్ కంపెనీలు భారతదేశంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయి.అమెరికన్ కంపెనీలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడం ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ కు ఏ మాత్రం ఇష్టం లేదు. అందువల్లే భారత్ మీద నిత్యం చిమ్ముతూనే ఉన్నాడు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టకుండా అమెరికా కంపెనీలను నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నాడు. 145 కోట్ల వినియోగదారుల మార్కెట్ ఉన్న భారతదేశంలో పెట్టుబడులు పెట్టకపోతే తమకు లాభాలు రావని అమెరికన్ కంపెనీలు భావించి.. మనదేశంలో భారీగా పెట్టుబడి పెడుతున్నాయి. మైక్రోసాఫ్ట్ నుంచి మొదలు పెడితే అమెజాన్ వరకు అన్ని కంపెనీలు భారతదేశానికి క్యూ కడుతున్నాయి.అమెజాన్ ఇప్పటికే భారత దేశంలో విస్తృతంగా వ్యాపార కార్యకలాపాలు సాగిస్తోంది.. మరో మూడు లక్షల కోట్ల పెట్టుబడి పెట్టడానికి ఆ కంపెనీ ముందుకు వచ్చింది. మైక్రోసాఫ్ట్ కూడా 1,50,000 కోట్లతో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చింది. గూగుల్ కూడా అత్యంత విలువైన డాటా సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. భవిష్యత్తు కాలంలో ఇంకా ఎక్కువ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని గూగుల్ ప్రకటించింది.. వాస్తవానికి ఈ మూడు సంస్థలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి ముందు.. ఆ కంపెనీ ప్రతినిధులను ట్రంప్ కలిశాడు.. మనదేశంలో పెట్టుబడులు పెట్టకుండా నిలిపివేయడానికి ప్రయత్నించాడు. కానీ ఆ కంపెనీలు ఏమాత్రం అందుకు ఒప్పుకోలేదు.అమెరికన్ కంపెనీలు భారతదేశంలోకి విపరీతంగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ట్రంప్ ఏమాత్రం సహించలేకపోతున్నాడు. భారతదేశం మీద ఏదో ఒక రకంగా విమర్శలు చేస్తూనే ఉన్నాడు.. అమెరికన్ కంపెనీలను తీవ్రస్థాయిలో తప్పుపడుతున్న ట్రంప్.. తన రియల్ ఎస్టేట్ కంపెనీ ద్వారా ఇండియాలోనే పెట్టుబడులు పెడుతుండడం విశేషం. ఇప్పటికే హైదరాబాదులో ట్రంప్ టవర్స్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని మొదలుపెట్టాడు అమెరికా అధ్యక్షుడు.

భవిష్యత్ కాలంలో తన వ్యాపారాన్ని ఇంకా పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. కానీ అమెరికన్ కంపెనీలను మాత్రం నిలువరిస్తున్నాడు.ట్రంప్ కు షాక్ ఇస్తూ అమెరికన్ కంపెనీలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడం వల్ల.. ఆర్థిక రంగం సమూల మార్పులకు గురవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం భారత్ ప్రపంచ ఆర్థిక శక్తులలో నాలుగో స్థానంలో ఉంది. ఇదే స్థాయిలో అమెరికన్ కంపెనీలు పెట్టుబడులు పెడితే నాలుగో స్థానం నుంచి మూడో స్థానానికి చేరుకునే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఒకప్పుడు చైనా సహాయంతో రష్యా స్థానాన్ని అమెరికా లాగేసుకుందని.. అయితే ఇప్పుడు చైనా ను అమెరికా నమ్మదని.. అమెరికాను కూడా చైనా నమ్మదని ఆర్థిక విశ్లేషకులు అంటున్నారు.. పైగా చైనాలో తన పెట్టుబడులను వెనక్కి తీసుకోవడానికి అమెరికా ఇష్టపడదని.. చైనాలో నియంతృత్వ ప్రభుత్వం ఉండడంతో అమెరికా కంపెనీలు ప్రత్యామ్నాయంగా భారత్ వైపు చూస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. పైగా భారత దేశంలో 145 కోట్ల జనాభా ఉన్న నేపథ్యంలో అమెరికన్ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెడుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. మరో వైపు మెరికా భారతదేశంపై వాణిజ్య ఒత్తిడి పెడుతున్నప్పటికీ, దాని సొంత ఆర్థిక?సాంకేతిక క్షేత్రాలు నష్టపోతున్నాయి. ట్రంప్ విదేశాంగ విధానం విఫలమనే ఆరోపణలు ఎదుగుతున్నాయి. భారత్‌తో పోలిస్తే, ఇజ్రాయెల్, రష్యా, గూగుల్ వంటి శక్తులు భారత్‌తో భాగస్వామ్యాలు పెంచుతున్నాయి.భారత్‌పై అదనపు సుంకాలు విధించి, వ్యవసాయ ఎగుమతులను (ముఖ్యంగా బియ్యం) నిరోధించాలని అమెరికా ప్రయత్నిస్తోంది. ఈ చర్యలు అక్కడి రైతులను కూడా ఆగ్రహపరుస్తున్నాయి. పాకిస్తాన్‌తో సన్నిహితత్వం కలిగి ఉండటం వల్ల ట్రంప్ విదేశ విధానం ప్రశ్నార్థకమవుతోంది, దీనికి నోబెల్ బహుమతి వ్యామోహం కూడా కారణంగా చెబుతున్నారు.గూగుల్ 2029 నాటికి భారత్‌లో 70 మిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్ నిర్మిస్తానని ప్రకటించింది. భారత్ డేటా సెంటర్ల ర్యాంకింగ్‌లో 14వ స్థానంలో ఉంది, అమెరికా, రష్యా, చైనా ముందున్నాయి. ఆసియా నిపుణులపై అమెరికా పరిమితులు వల్ల భారతీయులు కెనడా, ఆస్ట్రేలియా, యూకే వైపు మళ్లుతున్నారు. మైక్రోసాఫ్ట్ కూడా ఇలాంటి ప్రణాళికలు ప్రకటించింది, దీనివల్ల భారత్‌లో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.ఇజ్రాయెల్ భారత్‌తో రక్షణ ఒప్పందం కుదుర్చుకుంది. దేశంలోనే ఆయుధాల తయారీకి ముందుకు వచ్చింది. స్థానిక సంస్థలతో కలిసి ఈ ప్రాజెక్టులు అమలు చేస్తారు, దీనివల్ల పాకిస్తాన్, టర్కీలకు షాక్ ఇచ్చారు. అమెరికా ఈ అభివృద్ధిని ఎలా తీసుకుంటుందనే ఆందోళన పెరిగింది. రష్యా కూడా ఆయుధ తయారీలో భారత్‌తో సహకారం పెంచుతోంది.అమెరికా పాకిస్తాన్‌తో క్రిటికల్ మినరల్స్ ఒప్పందం చేసుకుంది, గనుల నుంచి వనరులు త్వరగా వెలికితీయాలని ప్రణాళికిస్తోంది. భారత్‌పై టారిఫ్‌లు వేస్తున్నప్పుడు, పాకిస్తాన్‌లో పెట్టుబడులు పెంచడం వివాదాస్పదంగా మారింది.

# చిరుధాన్యాలతో ఘన విజయం





ఆరోగ్యమే మహాభాగ్యం. మరి అలాంటి ఆరోగ్యం బాగుండాలంటే మంచి ఆహారం అవసరం. కానీ, ఆహార వ్యవహారాలను మారిన జీవనశైలి తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. ప్రాసెస్డ్ జంక్‌ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. దీంతో వయసుతో సంబంధం లేకుండా బీపీ, డయాబెటిస్ కొని తెచ్చుకుంటున్నారు. మరి ఇలాంటి పరిస్థితుల్లో 'ఆరోగ్యకరమైన ఆహారం మీ కోసం' అని ముందుకొచ్చింది పలక్ అరోరా. 'మిల్లియమ్' బ్రాండ్ పేరిట రెడీ టు కుక్ మిల్లెట్ మిక్స్‌తో ఆంత్రప్రెన్యూర్‌గా రాణిస్తున్న 26 ఏండ్ల పలక్ అరోరా కథ ఇది..

మిల్లెట్ పంటలు ఎలాంటి వాతావరణాన్నైనా తట్టుకుంటాయి. అలాగే వరి, గోధుమలకు కావాల్సినంత నీళ్లు ఈ చిరుధాన్యాల సాగుకు అవసరం లేదు. వీటివల్ల మట్టి కూడా సారవంతం అవుతుంది. అలాగే అందరికీ ఆరోగ్యం అనే కాన్సెప్ట్ నాది. వ్యవసాయ క్షేత్రం నుంచి కిచెన్ వరకు అన్ని దశల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో దీనిని ప్రారంభించాను.హర్యానాలోని ఫరీదాబాద్‌కు చెందిన పలక్ వాళ్లింటి టెర్రస్‌పై రకరకాల చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులు తయారు చేస్తున్నది. 'మిల్లియం' ఫుడ్ బ్రాండ్‌తో నేటితరానికి సంప్రదాయ చిరుధాన్యాలను పరిచయం చేస్తున్నది. స్థానిక రైతుల నుంచి చిరుధాన్యాలు కొనుగోలు చేసి.. రకరకాల వెరైటీలు అందిస్తున్నది. ఈ మిల్లెట్ మిక్స్‌లు బిజీబిజీగా ఆఫీసులకు పరిగెత్తేవాళ్లకు రెడీమేడ్‌గా రుచితోపాటు ఆరోగ్యాన్నీ ప్రసాదిస్తున్నాయి.

నాన్న ఆరోగ్యం కోసం..: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆంత్రప్రెన్యూర్ అండ్ మేనేజ్‌మెంట్‌లో ఫుడ్ ఇంజినీరింగ్ చేసింది పలక్. ఆమె మూడో సంవత్సరంలో ఉన్నప్పుడే రోగనిరోధక శక్తిని పెంచే ఆహారంపై పరిశోధన ప్రారంభించింది. ఆ సమయంలోనే పలక్ తండ్రికి మూత్రపిండాల సమస్య వచ్చింది. దానికి కారణం ఆయన దీర్ఘకాలంగా పోషకాహారం తీసుకోకపోవడమే అని డాక్టర్లు చెప్పారు. దాంతో తన కుటుంబానికి ఆరోగ్యకర ఆహారం అందించాలన్న లక్ష్యంతో ఈ చిరుధాన్యాల వైపు అడుగులు వేసిందామె.

మాతో పాటు అందరికీ..: 'మా నాన్న అనారోగ్యానికి గురైనప్పుడు మా కుటుంబమంతా ఒక్కసారిగా కుంగిపోయింది. ఫుడ్ ఇంజినీరింగ్ చేస్తున్న నాకు ఆహారమే మహాభాగ్యమని తెలిసినా, ఇంటి ఆహారాన్ని సరిగ్గా పట్టించుకోలేదు. కానీ, డాక్టర్లు మేము తినే ఆహారంలో పోషకాలు లేవన్నప్పుడు, నేను మన ముందు తరాల వాళ్లు తీసుకునే ఆహారం గురించి ఆరా తీశాను. వారి ప్రధాన ఆహారం చిరుధాన్యాలే అని తెలిసింది. దాంతో మా కుటుంబ ఆరోగ్యంతో పాటు నలుగురికీ ఈ ఆహారం అందించాలనుకున్నాను. అలా మొదలైందే మా 'మిల్లియం' బ్రాండ్. స్థానికంగా చిరుధాన్యాలు పండించే రైతులను సంప్రదించాను. వారి నుంచి మేలు రకం ధాన్యం కొనుగోలు చేస్తున్నాను. దీనిద్వారా వాళ్లకూ మంచి గిట్టుబాటు దక్కుతున్నది. నాకూ నాణ్యమైన ధాన్యం లభిస్తున్నది. అంతేకాదు, నాకు ఆంత్రప్రెన్యూర్ అవ్వాలన్నది ఎంత ఇష్టమో.. నలుగురికి ఉపాధి కల్పించడమూ అంతే ఆనందం. ఉత్పత్తుల తయారీ, ప్యాకింగ్ కోసం కొందరిని తీసుకున్నాం. వారంతా ఇప్పుడు సంతోషంగా ఉన్నారు' అని చెప్పుకొచ్చింది పలక్.



పురాతన ధాన్యాల్లోనే ఆరోగ్యం..: కరోనా లాక్‌డౌన్ సమయంలో పలక్ ఈఫుడ్ ప్రయోగాలు ప్రారంభించింది. కేవలం సోలార్ డ్రైయర్స్, బ్లెండర్స్‌తో చిరుధాన్యాలను శుభ్రం చేసి పొడి చేసేది. ఇలా పొడులైతే ఉద్యోగులకు త్వరగా వండుకునే అవకాశం ఉంటుందని పలక్ ఉద్దేశం. అప్పుడే ఆమె ప్రభుత్వరంగ సంస్థల నుంచి సర్టిఫికెట్లు పొంది, పూర్తిస్థాయి ఆంత్రప్రెన్యూర్‌గా మారింది. గోధుమ పిండిని ప్రజలు ఎలా విరివిగా వాడుతున్నారో, ఈ చిరుధాన్యాల మిక్స్‌లను కూడా అలాగే వాడాలన్నది తన లక్ష్యం అంటుంది పలక్.

కుటుంబ ప్రోత్సాహం..: ప్రయోగాల పేరిట కుస్తీ పడుతున్న కూతురుని తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు ప్రోత్సహించారు. ఈ ఫుడ్ ప్రొడక్ట్ తయారీలో తన తల్లి ఎంతో సహకరిస్తుందని పలక్ చెప్పుకొచ్చింది. రుచి చూడడం, పరిమాణాల్లో మార్పులు చెప్పడం వంటివి ఆవిడే చెప్పేవారట. అలా ఆర్థికంగా, ఎమోషనల్‌గా ఫ్యామిలీ ఎంతగానో సపోర్ట్‌గా నిలిచిందంటుంది పలక్.

'మిల్లియం' బ్రాండ్ మొదటి ప్రొడక్ట్ రెడీ ఫర్ కుక్ పోరిడ్జ్. తర్వాత వెజిటేబుల్ మిక్స్ ఇడ్లీ పిండి, పంజాబీ ట్విస్టెల్ చీలా పొడి ఇలా రకరకాల ఉత్పత్తులు తయారు చేస్తున్నది. 2021 సెప్టెంబర్‌లో పలక్ తన కంపెనీని రిజిస్టర్ చేయించింది. తర్వాత 2022 జూన్‌లో మిల్లియం బ్రాండ్‌ను లాంచ్ చేసింది.

టన్నుల కొద్దీ ఉత్పత్తి..: ఒకప్పుడు టెర్రస్‌నే కిచెన్‌గా మార్చుకున్న పలక్ ఇప్పుడు ఫరీదాబాద్‌లో భారీ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను స్థాపించింది. నెలకు ఎనిమిది టన్నుల 'రెడీ టు కుక్', 21 టన్నుల 'రెడీ టు ఈట్ మిల్లెట్ ప్రొడక్ట్స్' ఉత్పత్తి చేస్తున్నది. అందులో రాగి సూప్, మిల్లెట్ నూడుల్స్, పాస్తా, మిల్లెట్ పోహా, పాన్ కేక్ మిక్స్ ఇలా 15 రకాల ఉత్పత్తులు ఉన్నాయి. అందుబాటు ధరల్లోనే విక్రయిస్తున్నది. అలాగే తన ఉత్పత్తులను హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సర్వీసులకు అందిస్తూనే, దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుంటున్నది. 'హెల్దీ బీ జల్దీ బీ' అనే ట్యాగ్‌లైన్‌తో విపణిలోకి ప్రవేశించిన పలక్‌కు ఆదిలో ఆటుపోట్లు ఎదురైనా తట్టుకొని నిలబడింది. ఇప్పుడు నెలకు లక్షల్లో టర్నోవర్ సాధిస్తూ.. వినియోగదారులకు రెడీమేడ్ ఆరోగ్యాన్ని అందిస్తున్నది.

## స్వర్ణగ్రామాలుగా సచివాలయాలు

విజయవాడ, : ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఏపీలో గ్రామ, వార్డు సచివాలయాల పేర్లను మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. వాటి పేర్లను స్వర్ణగ్రామం శాఖగా మార్చను నట్లు ప్రకటించారు. కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు జారీ అవుతాయని తెలిపారు. ఒకటి లేదా లేదు రోజుల్లో దీనికి సంబంధించి జీవో జారీ చేసే అవకాశముందని తెలుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిల్లో చాలా మార్పులు చేస్తుండగా.. ఇప్పుడు పేరును మార్చడం చర్చనీయాంశంగా మారింది.అమరావతిలోని సచివాలయంలో బుధవారం కలెక్టర్ల సమావేశం జరిగింది. ఈసమావేశంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా వాటి పేరును స్వర్ణగ్రామంగా త్వరలో మార్చుతున్నట్లు చంద్రబాబు స్పష్టతిచ్చారు. వీటి పేరును మార్చుతారనే ప్రచారం ఎప్పటినుంచో జరుగుతోంది. స్వర్ణంధ్ర విజన్-2047లో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాను విజన్ యూనిట్లుగా ఉపయోగించుకోవాలని గతంలో చంద్రబాబు సూచించారు. విజన్ సాధించడంలో వీటి పాత్ర కీలకమని తెలిపారు. ఆ విజన్‌లో భాగంగా రాష్ట్రాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక తయారుచేశారు.ఈ క్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు మార్చడం హాట్‌టాపిక్‌గా మారింది.గ్రామ స్థాయిలో గ్రామ, వార్డు సచివాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇంతకముందు ఏదైనా ప్రభుత్వ సేవలు, సర్టిఫికేట్లు పొందాలంటే ఎమ్మార్వో ఆఫీస్‌కు వెళ్లాల్సి వచ్చింది. ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ రోజులపాటు తిరగాల్సి వచ్చేది. కానీ గ్రామ సచివాలయాలు వచ్చాక ఊర్లోనే ప్రజలు అన్నీ ప్రభుత్వ సేవలు పొందుతున్నారు. ఏదైనా సర్టిఫికేట్ కావాలన్నా ఇక్కడికి వెళ్లి దరఖాస్తు పెట్టుకుంటే వెంటనే మంజూరు చేస్తున్నారు. అందుకేకాకుండా సచివాలయ ఉద్యోగులు నేరుగా ఇంటికి వచ్చి సేవలు అందిస్తున్నారు.

### నారాయణపూర్ గ్రామ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన హరి పుష్పలత, అశోక్

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** సిద్దిపేటజిల్లా కోహెడ మండలం నారాయణపూర్ గ్రామంలోగ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతన సర్పంచ్‌గా ఎన్నికైన హరి పుష్పలత, అశోక్ మరియు ఉపసర్పంచ్ మరియు నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన పాలక మండలికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం సర్పంచ్ హరి పుష్పలత, అశోక్ మాట్లాడుతూ. గ్రామ అభివృద్ధేతమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. త్రాగునీటి సమస్యలు,డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, విద్యుత్ సౌకర్యాలు, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెడతానని అన్నారు.

## వాట్సాప్ లో టిక్కెట్ల బుకింగ్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు శుభవార్త చెప్పింది! ఇకపై ఏపీఎస్ఆర్టీసీ బస్సు టికెట్లను వాట్సాప్ ద్వారానే సులభంగా బుక్ చేసుకోవచ్చు. 9552300009 నంబర్‌కు 'ఊఎ' అని మెసేజ్ పంపి, ప్రయాణ వివరాలు అందించి, ఆన్‌లైన్‌లో పేమెంట్ చేస్తే చాలు. టికెట్ మీ వాట్సాప్‌కే వస్తుంది. ఈ కొత్త సేవను ప్రయాణికులు ఉపయోగించుకోవాలని ఆర్టీసీ సూచిస్తోంది. ప్రయాణికులు నిమిషాల వ్యవధిలోనే బసు టికెట్లను బుక్ చేసుకోవచ్చు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు తీపికబురు చెప్పింది.. ఏపీఎస్ఆర్టీసీ బస్సుల టికెట్లను వాట్సాప్ (మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్) ద్వారా బుక్ చేసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటి వరకు ఆర్టీసీ యాప్, వెబ్‌సైట్, రిజర్వేషన్ కౌంటర్ల ద్వారా టికెట్లు బుక్ చేసుకుంటున్నారు.. కానీ ఇకపై వాట్సాప్ ద్వారా కూడా బుక్ చేసుకోవచ్చు. ప్రయాణికులు వాట్సాప్ ద్వారా చాలా సులభంగా ఈ టికెట్లను బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. ఈ మేరకు ఏపీఎస్ఆర్టీసీ ట్వీట్ చేసింది.. ప్రయాణికులు వాట్సాప్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో టికెట్లను వాట్సాప్ ద్వారా ఎలా బుక్ చేసుకోవాలో చెబుతూ వివరాలు కూడా ప్రస్తావించారు.ప్రయాణికులు 9552300009 నంబర్‌ను సేవ్ చేసుకోవాలి.. అనంతరం ఆ నంబర్‌కు వాట్సాప్‌లో ఊఎ మెసేజ్ పంపాలి. అప్పుడు కొన్ని ఆప్షన్స్ వస్తాయి.. అందులో అష్ట్రనీనీబవ ౖావతీలతిఇ఼వ ను ఎంచుకోవాలి. ంఖూఖీఅౖావతీలతిఇ఼వబ ఆప్షన్‌ను ఎంచుకుని..టిక్కెట్ బుకింగ్ ను ఎంపిక చేసుకుకోవాలి. అక్కడ ప్రయాణానికి సంబంధించిన వివరాలు (ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలో) సమాచారం ఎంటర్ చేయాలి.

అనంతరం ఆన్‌లైన్ పేమెంట్ చేస్తే టికెట్ బుక్ అవుతుంది.. అనంతరం వాట్సాప్‌కు టికెట్ మెసేజ్ కూడా వస్తుంది. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.వాట్సాప్ ద్వారా ఆర్టీసీ బస్ టికెట్లను బుక్ చేసుకోవచ్చని ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు బస్ స్టేషన్లు, రిజర్వేషన్ కౌంటర్లు, ఎంక్వైరీ కౌంటర్లు, బస్ స్టేషన్లతో పాటుగా అవసరమైన చోట స్టిక్కర్లు, బ్యానర్లు ప్రదర్శించనున్నారు. బస్సుల్లో కూడా స్టిక్కర్లు అంటించి వాట్సాప్ నంబర్ 9552300009 (మన మిత్ర) ద్వారా ఆర్టీసీ బస్సు టికెట్లు బుక్ చేసుకోవచ్చని ప్రచారం కల్పించనున్నారు. ఇంగ్లీష్, తెలుగు భాషలలో వాట్సాప్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. సంక్రాంతి సమయం కావడంతో ఎక్కువమంది ప్రయాణికులు వాట్సాప్ ద్వారా బస్ టికెట్లను బుక్ చేసుకునేలా ఆర్టీసీ అవగాహన కల్పిస్తోంది. మొత్తానికి ఆర్టీసీ బస్ టికెట్లు బుక్ చేసుకునే సేవలు కూడా వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చాయి.

## బుల్లెట్ ట్రైన్ పై అప్ డేట్...



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఏపీ మీదుగా హైస్పీడ్ బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం కసరత్తు జరుగుతోంది. హైదరాబాద్ - బెంగళూరు మార్గంలో బుల్లెట్ రైలు నడపాలనే ఆలోచనలో కేంద్రం ఉంది. అందులో భాగంగా ఈ మార్గంలో బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలో మంగళవారం భూ పరీక్షలు నిర్వహించారు. ప్రతిపాదిత బుల్లెట్ రైల్వే లైన్ అనంతపురం జిల్లా మీదుగా వెళ్లే అవకాశం ఉండటంతో..నిపుణులు పలుచోట్ల మట్టిని సేకరించి.. పరీక్షలు నిర్వహించారు ఆంధ్రప్రదేశ్‌లో బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు దిశగా కసరత్తు జరుగుతోంది. ఏపీలో బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు దిశగా అధికారులు చర్యలు ప్రారంభించారు. దక్షిణాదిలో పెద్ద నగరాలైన హైదరాబాద్ - బెంగళూరు, అలాగే హైదరాబాద్ - చెన్నై నగరాల మధ్య బుల్లెట్ రైలు నడపాలని కేంద్రం భావిస్తోంది. అందుకు అనుగుణంగా ఈ మార్గాల్లో బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం ప్రణాళికలు రచిస్తున్నారు. హైదరాబాద్ - బెంగళూరు బుల్లెట్ రైల్వే లైన్ ఏపీలోని అనంతపురం జిల్లా మీదుగా వెళ్తుంది. అలాగే హైదరాబాద్ - చెన్నై బుల్లెట్ రైల్వే లైన్ గుంటూరు జిల్లా మీదుగా వెళ్లేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ - బెంగళూరు హైస్పీడ్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం అధికారులు కసరత్తు మొదలెట్టారుఅందులో భాగంగా అనంతపురం జిల్లాలో పరీక్షలు నిర్వహించారు. హైస్పీడ్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం భూసామర్థ్యాన్ని నిర్ధారించేందుకు అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రోజున మట్టి పరీక్షలు చేశారు. అనంతపురం రూరల్ మండలం, బుక్కరాయసముద్రం మండలంలోని కొన్ని గ్రామాలతో పాటుగా, సిద్దరాంపురం పరిసరాల్లో నిపుణుల బృందం మట్టి పరీక్షలు నిర్వహించింది. 40 పాయింట్ల వద్ద నుంచి మట్టి నమూనాలను సేకరించినట్లు సమాచారం.మరోవైపు దక్షిణాదిలోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అమరావతిలను అనుసంధానం చేస్తూ బుల్లెట్ రైలు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు గత కొంతకాలంగా కేంద్రానికి ప్రతిపాదిస్తున్నారు. ఈ బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం సర్వే కూడా మొదలైందని ఇటీవల సీఎం చంద్రబాబు వెల్లడించారు. విశాఖపట్నంలో జరిగిన ఇండియా ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్ 2025లో భాగంగా చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. త్వరలోనే దక్షిణ భారతదేశానికి కూడా బుల్లె?ట్ రైలు వస్తుందని చంద్రబాబు ఈ సందర్భంగా వెల్లడించారు. సర్వే కూడా పూర్తైందని.. హైదరాబాద్, చెన్నై, అమరావతి, బెంగళూరును కలుపుతూ దీనిని ఏర్పాటు చేస్తారని చంద్రబాబు చెప్పుకొచ్చారు.ఈ నాలుగు నగరాల జనాభా కోట్లల్లో ఉందన్న చంద్రబాబు.. వీటిని అనుసంధానం చేస్తే ప్రపంచంలోనే అతిపెద్ద క్లస్టర్‌గా, అతిపెద్ద మార్కెట్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే బుల్లెట్ రైలు వస్తే దక్షిణాది ప్రాంత అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారుతుందని అభిప్రాయపడ్డారు. మరోవైపు మన దేశంలో తొలి బుల్లెట్ రైలును ముంబయి- అహ్మదాబాద్ మధ్య ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే దక్షిణాది లోనూ బుల్లెట్‌రైలు ఏర్పాటు చేస్తే.. నాలుగు ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం తగ్గుతుందని... వాణిజ్యం, వ్యాపారం. వర్తకం, సాంస్కృతిక, పర్యాటకంగా నాలుగు ప్రాంతాల మధ్య సంబంధాలు మరింత బలోపేతమవుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి

## ఎమ్మెల్యేలు పనితీరు పై నెగిటివ్ ఉందా

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ప్రభుత్వ అధినేత తీసుకునే నిర్ణయాలు కొంత వరకే పనిచేస్తాయి. కానీ ఎమ్మెల్యేల పనితీరు మాత్రం తీవ్రంగా ప్రభావం చూపుతాయి. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను మాత్రమే చూస్తారు. ఇప్పుడు కూటమి పార్టీలకు కూడా ఇదే తలనొప్పిగా మారింది. 164 స్థానాల్లో కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీలు గెలిచాయి.

అది మొన్నటి ఎన్నికల్లో వరంగా కనిపించినా రానున్న ఎన్నికల్లో శాపంగా మారనున్నాయి. ఎందుకంటే ఖచ్చితంగా లోకల్ ఎమ్మెల్యేలపై ప్రతికూలత ఉంటుందన్నది వాస్తవం. ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచిన వారు అన్ని సమస్యలను పరిష్కరించలేరు. అదేసమయంలో అనేక కొత్త సమస్యలు వచ్చిపడతాయి. వాటిని పరిష్కరించుకోవాలంటే ప్రభుత్వం నుంచి నిధులు అందడం లేదుగతంలో సంక్షేమ పథకాలు తక్కువగా..

అభివృద్ధి పనులకు ఎక్కువగా నిధులు వినియోగించేవారు. కానీ 2019 నుంచి ఆ పరిస్థితి మారింది. నాడు జగన్ ప్రభుత్వమైనా, నేడు కూటమి ప్రభుత్వమైనా సంక్షేమానికి పెద్దపీట వేస్తుంది. అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించలేకపోతుంది. మరొకవైపు కూటమి ప్రభుత్వానికి రాజధాని అమరావతి ప్రధానంగా మారింది.

దీంతో నిధులు, తీసుకు వచ్చిన అప్పులు రాజధాని అమరావతిలోనే కుమ్మరిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సయితం అమరావతికి తీసుకు వచ్చిన రుణాలను వేరే వాటికి ఉపయోగించలేమని, అలాగే తీసుకున్న అప్పులను కూడా కొన్నింటికే పరిమితం చేస్తామని పదే పదే చెబుతున్నారు. మరొకవైపు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పనులు జరగకపోవడంతో పాటు మద్యం, ఇసుక వంటి వాటిల్లో వేలుకాదు..

ఏకంగా చేతులే పెట్టేశారు. అదీ కూటమికి ఇబ్బందికరంగా మారింది. 164 మంది కూటమి ఎమ్మెల్యేల్లో అత్యంత తక్కువగా అంటే దాదాపు నలభై మంది ఎమ్మెల్యేలు మాత్రమే నిధులు ఎలాగోలా తెచ్చుకుని తమ నియోజకవర్గాల్లో సమస్యలను పరిష్కరి ంచుకుంటున్నారు. ఫలితం కనిపించడం లేదని వాపోతున్నారు. దీంతో ఇటు ఎమ్మెల్యేల అక్రమా లు, అవినీతి మరొకవైపు నియోజకవర్గాల్లో సమస్యలు పేరుకుపోవడం కూటమి పార్టీకి మైనస్ గా మారింది. మరో మూడేళ్లలో వీటి నుంచి బయటపడాలంటే మాత్రం పెద్దయెత్తున కసరత్తు జరగాల్సి ఉంటుంది.

## భూసేకరణ ఇబ్బందులతో నిలిచిన ప్రాజెక్టులు..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ప్రాజెక్టులను ప్రతిపాదించాలి? భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయాలి? ఆతర్వాత టెండర్లు ఖరారు చేయాలి? కానీ కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టులకు భూములు లేకుండానే, టెండర్లు ఖరారు చేయడం ఆనవాయితీగా మారింది. రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో చేస్తున్న హడావుడి మాత్రం అంచనాలకు మించిపోతున్నది. ఇప్పటివరకు ప్రతిపాదించిన ప్రాజెక్టులు కాగితాలు దాటకముందే, అనుమతులు, డిజైన్లు ఖరారు చేసి, టెండర్లు ఆహ్వానించి కాంట్రాక్టర్లకు పనులన్నీ కట్టబెట్టడం వరకు చకచకా సాగిపోతున్నాయి. ఆ తర్వాత భూసేకరణలో బాధితులు చెప్పే అభ్యంతరాలతో ప్రాజెక్టులు ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయి.

కోర్టులను ఆశ్రయించి, వందలాది కేసులు..: హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న ఈ రెండు కీలక ప్రాజెక్టుల విషయంలో వందలాది మంది కోర్టులను ఆశ్రయించి, ప్రాజెక్టులకు భూములు ఇచ్చే అంశంలో వెనుకడుగు వేస్తున్నారు. ప్రభుత్వ ఒత్తిడితో మాత్రం హెచ్ఎండీఏ టెండర్లను ఆహ్వానించడం, వాటిని ఖరారు చేసి కంపెనీలకు కట్టబెట్టడం సర్వసాధారణంగా మారింది. ప్రాజెక్టులకు అవసరమైన భూములు లేకుండానే ప్రాజెక్టులకు టెండర్లను పిలిచి జనాలను మభ్యపెడుతుందే తప్ప.. ప్రతిపాదనల్లో ఎలాంటి పురోగతి ఉండటం లేదని రావిర్యాల గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్-1 విషయంలోనే తేటతెల్లమైంది. ఈ ప్రాజెక్టు కోసం వందలాది ఎకరాల పంట పొలాలను లక్ష్యంగా చేసుకుని భూసేకరణ ప్రక్రియ మొదలు పెట్టింది.అదే సమయంలోనే టెండర్లు ఖరారు చేసి ఓ వివాదాస్పద కంపెనీకి పనులు కూడా అప్పగించింది. కానీ ఇప్పటికీ ఈ ప్రాజెక్టుపై హైకోర్టులో వాదనలను బాధితులు వినిపిస్తూనే ఉన్నారు. ఇక ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు అంశంలో ఏకంగా 1000 మంది ప్రాజెక్టుకు వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించి, వారి ఆస్తులకు రక్షణ పొందుతున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం మరోసారి టెండర్లు ఖరారు చేసి, ఓ కంపెనీకి కట్టబెట్టే పనిలో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలోఫైనాన్షియల్, టెక్నికల్ బిడ్డింగ్‌లను కొలిక్కి తీసుకు రానున్నారు. ఇలా ప్రాజెక్టుల విషయంలో టెండర్లతో బాధితులను ఆందోళనకు గురి చేస్తోంది. కోకాపేట నుంచి పరిగి వరకు నిర్మించే గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలోనూ హెచ్ఎండీఏకు రైతుల నుంచి తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్లతో ఒరిగేదేమీ లేదని చెబుతున్నా? అభ్యంతరాలను స్వీకరిస్తున్నా మని చెప్పి? టెండర్లు ఆహ్వానించే పనిలో అధికారులు ఉన్నారు.

భూములుఇచ్చేది లేదని చెబుతున్నా..: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే శామీర్‌పేట-జేబీఎస్, ఎగ్జిట్ నంబర్..13 నుంచి ఫ్యూచర్ సిటీ వరకు, కోకాపేట నుంచి పరిగి మండలం చిట్యాల వరకు గ్రీన్ ఫీల్డ్ రేడియల్‌రోడ్లను వేలకోట్ల రూపాయల అంచనాతో నిర్మించేందు కు ప్రతిపాదించింది. అవసరమైన భూముల సేకరణ జరగకుండానే, హెచ్ఎండీఏ మాత్రం టెండర్లు ఖరారు చేసే పనిలో ఉంది. ప్రధాన ప్రాజెక్టుల విషయంలో వందలాది మంది జనాలు కోర్టులను ఆశ్రయి స్తున్నారు. ప్రాజెక్టులో నిలోపాలు, విధానపరమైన ఇబ్బందులు, వ్యక్తిగత నష్టపరిహారం విషయంలో భూములు ఇచ్చేది లేదని చెబుతున్నారు.

# అటు నీళ్లు.. ఇటు జేళ్లు



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** 'బచావత్ ట్రిబ్యునల్, బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ చేసిన నీటి కేటాయింపులను మార్చడానికి వీల్లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చారిత్రక రక్షణలు ఉన్నాయి. ఆ నీటి కేటాయింపులను యథావిధిగా కొనసాగించాలి'- ఇదీ కృష్ణా జలాలకు సంబంధించి ఏపీ ప్రభుత్వం ఇటీవల ట్రిబ్యునల్ ఎదుట చేసిన వాదన. తెలంగాణ నీటిహక్కులకు రక్షణ కల్పించకుండా పోలవరం-నల్లమలసాగర్ (పీఎన్) లింకు ప్రాజెక్టుకు అనుమతిస్తే, రేపటిరోజున గోదావరి బేసిన్‌లోనూ ఇదే పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉన్నది. రాష్ట్ర సాగునీటి హక్కులకు తీవ్ర విఘాతం వాటిల్లనున్నది.

గోదావరి నదీ జలాల పంపిణీ కోసం బచావత్ ట్రిబ్యునల్ ఏర్పాటుచేశారు. ఈ ట్రిబ్యునల్ 1980లో అవార్డు ప్రకటించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు గోదావరి జలాల్లో 1,486 టీఎంసీలు కేటాయించింది. అందు లో తెలంగాణ వాటా 968 టీఎంసీలు, ఏపీ వాటా 518 టీఎంసీలు. అయితే ఆ కేటాయింపులు చెల్లబోవని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి ఏపీ అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నది. ఏపీకి 775 టీఎంసీలకుపైగా కేటాయించాలని పట్టుబడుతున్నది. అందుకోసం వ్యూ హాత్మకంగా ముందుకు సాగుతున్నది. ఇప్పటికే ట్రిబ్యునల్ ఏర్పాటుచేయాలని కోరుతూ కేంద్రానికి ఫిర్యాదు చేసింది. మరోవైపు, పోలవరం-నల్లమలసాగర్ (పీఎన్) లింకు ప్రాజెక్టను చేపట్టేందుకు దూకుడుగా ముందుకు సాగుతున్నది. ఈ లింకు ప్రాజెక్టును ముందస్తుగా మొదలుపెట్టి చారిత్రక రక్షణలు పొందేందుకు ఎత్తులు వేస్తున్నది. తద్వారా గోదావరి జలాల్లో ఎక్కువ వాటా పొందాలన్నదే ఏపీ అసలు ఉద్దేశమని తేటతెల్లమవుతున్నది. ప్రాజెక్టుకు అదే జరిగితే ఎగువన తెలంగాణకే తీరని నష్టం వాటిల్లనున్నది. గోదావరి జలాల్లో వాటాకు గండిపడటమే కాక, భవిష్యత్తులో ప్రాజెక్టులు చేపట్టేందుకు సైతం పెనుముప్పుగా మారనున్నది.

ఇవీ చారిత్రక రక్షణలు: నదీజలాలను వినియోగించుకునే రాష్ట్రాలు ప్రాజెక్టులను నిర్మించుకోవడం పరిపాటి. నీటివాటాల ఆధారంగా ప్రాజెక్టులను నిర్మించుకోవాల్సి ఉంటుంది. ఆర్థిక వెసులుబాటును బట్టి కొన్ని రాష్ట్రాలు ముందుగా, మరికొన్ని రాష్ట్రాలు ఆలస్యంగా నిర్మించుకోవచ్చు. అయినప్పటికీ, ట్రిబ్యునళ్ల ఏర్పాటుకు ముందే నిర్మాణం పూర్తయి వినియోగంలో ఉన్న, నిర్మాణంలో కొనసాగుతున్న, ప్రతిపాదిత ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల్లో ట్రిబ్యునళ్లు తొలి ప్రాధాన్యమిస్తాయి. కృష్ణా జలాల్లో ఇదే తరహాలో గతంలో ఏపీ భారీగా లబ్ధి పొందింది.

కృష్ణా డెల్టాకు 183 టీఎంసీలు, కేసీ (కర్నూలు-కడప) కెనాల్‌కు 39 టీఎంసీలు తదితర ప్రాజెక్టులకు చారిత్రక రక్షణల కింద నీటిని కేటాయించుకున్నది. ప్రస్తుతం తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీ కోసం బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణలోనూ ఇదే విషయాన్ని ఏపీ పదే పదే నొక్కిచెప్తున్నది.

కృష్ణా జలాల వివాదాల పరిష్కార ట్రిబ్యునల్-1 (కేడబ్ల్యూడీటీ), ట్రిబ్యునల్-2 చేసిన కేటాయింపులను ఎట్టి పరిస్థితుల్లో మార్చకూడదని వాదనలు వినిపిస్తున్నది. ఆ నీటి కేటాయింపులను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నది.

ఇప్పటికే ట్రిబ్యునల్ కోసం కేంద్రానికి ఫిర్యాదు: పోలవరం వద్ద లభ్యతలో సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) 2023లో హైడ్రాలజీ స్టడీ నిర్వహించింది. పోలవరం వద్ద నీటి లభ్యత 496 టీఎంసీలని లెక్క తేల్చింది. అందులో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి నీటి వినియోగాలకు 449.78 టీఎంసీలు సరిపోతాయని కూడా స్పష్టంగా పేర్కొన్నది. అయితే. సీడబ్ల్యూసీ లెకలపై ఏపీ అభ్యంతరం తెలిపింది. అక్కడితో ఆగకుండా అసలు గోదావరి నీటి కేటాయింపులే తప్పంటూ కొత్తవాదం ముందుకు తెచ్చింది. బచావత్ ట్రిబ్యునల్ తెలంగాణకు ఎకువ నీటిని కేటాయించిందని, వాస్తవంగా తమకే ఎకువ వాటా రావాలని ఏ పీ వాదిస్తున్నది. మొత్తంగా 1,486 టీఎంసీల్లో 775 టీఎంసీలు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నది. పోలవరం వద్ద అవసరాలుపోనూ మిగులు జలాలతోనే బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపడుతున్నామని గతంలోనే వెల్లడిచింది. అందులో భాగంగా గోదావరి జలాల పంపిణీ కోసం ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని అంతర్రాష్ట్ర నదీ జలాల చట్టం-1956 సెక్షన్ 5 ప్రకారం ఇప్పటికే కేంద్రానికి ఏపీ ఫిర్యాదుచేసింది. అది కేంద్రం పరిశీలనలోనే ఉన్నది. ఏదైనా రాష్ట్రం నీటి కేటాయింపుల్లో అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేస్తే కేంద్రం ట్రిబ్యునల్ ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఏపీ చేసిన ఫిర్యాదు కేంద్రం పరిశీలనలో ఉన్నది. ట్రిబ్యునల్‌ను ఏర్పాటుచేసే అవకాశమూ ఉన్నదని తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ఆలోగానే పీఎన్ లింకు ప్రాజెక్టును ప్రారంభించాలనేది ఏపీ ఎత్తుగడగా తెలుస్తున్నది. తద్వారా ప్రాజెక్టుకు రక్షణ పొందే అవకాశమూ ఏర్పడుతుందని నీటిరంగనిపుణులు వివరిస్తున్నారు.

తెలంగాణ నీటిహక్కులకు గొడ్డలిపెట్టు: సముద్రంలోకి వృథాగా పోయే నీటినే వాడుకుంటామని ఏపీ నమ్మబలుకుతున్నది. కానీ, గోదావరిలో వరదపై ఇప్పటివరకు శాస్త్రీయ లెక్కలే లేవు. ఆ లెకలు తేలకుండా కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టులకు లింక్ చేయడం అక్రమం. అదీగాక బేసిన్‌లోని రాష్ట్రాల నీటిహక్కులకు తీరని నష్టం వాటిల్లుతుంది. పీఎన్ లింకు మరీ ముఖ్యంగా తెలంగాణకు గొడ్డలిపెట్టులా మారనున్నది. ఎలాగంటే గోదావరి జలాల్లో బచావత్ ట్రిబ్యునల్ తెలంగాణకు 968 టీఎంసీలు కేటాయించింది. రాష్ట్ర ఏర్పాటు నాటికి అందులో 200 టీఎంసీలకు మించి వాడుకున్నది లేదు. మిగతా కేటాయింపులన్నీ కాగితాల మీదనే ఉన్నాయి. అందుకు ఇచ్చంపల్లి ప్రాజెక్టు సజీవ సాక్ష్యం. రాష్ట్ర ఏర్పాటు తరువాత కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరిలో ట్రిబ్యునల్ కేటాయింపులకు అనుగుణంగా ప్రాజెక్టులు చేపట్టింది. కాళేశ్వరం, సీతమ్మసాగర్, మోడికుంట, చనాక కొరాట, సమ్మక్కసాగర్ తదితర ప్రాజెక్టులు చేపట్టడమేగాక, దాదాపు 467 టీఎంసీలకు కేంద్ర సంస్థల నుంచి అనుమతులు తీసుకొచ్చింది. మొత్తంగా 833 టీఎంసీల వినియోగానికి ప్రాజెక్టులు చేపట్టింది. మిగిలిన నికర జలాలను భవిష్యత్తు అవసరాల కోసమని ప్రణాళికలు సైతం చేసింది. ప్రస్తుతం తెలంగాణ ప్రాజెక్టులు పూర్తికాలేదు. ఆ మేరకు నీటి వినియోగం ప్రారంభం కాలేదు. తెలంగాణే కాదు ఎగువ ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర సైతం పూర్తిస్థాయి కేటాయింపుల మేరకు వినియోగించుకోవడం లేదు.ఫలితంగానే గోదావరిలో వరద వస్తున్నది.

ఎగువ రాష్ట్రాలు కేటాయింపుల మేరకు వాడుకుంటే గోదావరిలో వరద ప్రవాహాలు తగ్గిపోతాయి. కానీ, ఏపీ వరద పేరిట ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధమైంది. అదే జరిగితే ఏపీకి ఆ మేరకు హ క్కు లు లభిస్తాయి. రేపటిరోజున ఎగువ రాష్ట్రాలు క్రమం తప్పకుండా దిగువ ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. నికర జలాల ఆధారంగానే తెలంగా ణ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణంపై ఏపీ ఇప్పటికే అనేక ఫిర్యాదులు కేంద్రానికి చే సింది. రేపటి రోజున పీఎన్ లింకు నిర్మాణం పూర్తయితే ఏపీకి హక్కులు లభిస్తాయి. కేంద్ర సంస్థలు సైతం దిగువన ఏపీ ప్రాజెక్టులపై ఉన్న ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుంటూ ఎగువన తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయాల్సి ఉంటుంది. ఇది తెలంగాణ హక్కులకు తీరని నష్టంగా మారుతుంది. దిగువ ప్రాజెక్టులకు నీటిని వదులుతూ ఎగువ రాష్ట్రాలు నీటిని వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఆ మేరకు ఆపరేషన్ ప్రొటోకాల్‌ను పాటించాల్సి ఉంటుంది.

నేడు గోదావరిలోనూ అదే ఎత్తుగడ!: కృష్ణా జలాల్లో అనుసరించిన విధానాన్నే గోదావరి జలాల్లోనూ అమలుచేసేందుకు ఏపీ వ్యూహాత్మకంగానే ముందుకు సాగుతున్నది. చారిత్రక రక్షణల కింద గోదావరి జలాలనూ కొల్లగొట్టే ఎత్తుగడలు అనుసరిస్తున్నది. అందులో భాగంగానే పోలవరం-నల్లమలసాగర్ లింకు ప్రాజెక్టును చేపట్టేందుకు శరవేగంగా ముందుకు సాగుతున్నది.

వరద జలాలనే వాడుకుంటా మని ఏపీ బుకాయిస్తున్నది. వరద జలాల్లో 200 టీఎంసీలను పోలవరం-ప్రకాశం (కృష్ణా)- బొల్లాపల్లి రిజర్వాయర్ మీదుగా వెలిగొండ ప్రాజెక్టులో భాగమైన నల్లమలసాగర్‌కు మళ్లించేందుకు పీఎన్‌లింకు ప్రాజెక్టును చేపట్టింది. ప్రస్తుతానికి 50 టీఎంసీలను మళ్లిస్తామని,

మిగతా 150 టీఎంసీలను భవిష్యత్తులో బనకచర్లకు లేదంటే పెన్నా బేసిన్‌లోని సోమశిల లింకు ప్రాజెక్టు పీఎఫ్ఆర్ (ప్రీ ఫిజబిలిటీ రిపోర్టు)ను ఇప్పటికే కేంద్రానికి సమర్పించింది. 2017 మార్గదర్శకాల ప్రకారం పీఎఫ్ఆర్‌కు సూత్రప్రా య అంగీకారం లభించిన తరువాతే డీపీఆర్ తయారుచేయాలి. కానీ, ఏపీ మాత్రం పీఎఫ్ఆర్‌కు ఎలాంటి ఆమోదం లభించకముందే పీఎన్ఎల్‌పీ డీపీఆర్ తయారీకి సిద్ధమైంది. టెండర్ల ప్రక్రియను సైతం పూర్తి చేసింది

# టీ రేషన్ యాప్...




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డ్ ఉన్నవారి సౌకర్యం కోసం 'టీ-రేషన్' అనే అత్యాధునిక మొబైల్ యాప్‌ను ఇటీవల ప్రవేశపెట్టింది. ఈ యాప్ ద్వారా రేషన్ సేవలను ఇంటి నుంచే సులభంగా పరిశీలించవచ్చు, ఎటువంటి ఇబ్బందులు లేకుండా. సాంకేతికత ఆధారంగా రూపొందించిన ఈ యాప్, పౌరులకు పారదర్శకతను, సౌలభ్యాన్ని అందిస్తుంది. ఈ యాప్ ప్రధాన లక్ష్యం ఏమిటంటే, రేషన్ షాపులకు వెళ్లి ఎదురుచూడాల్సిన ఇబ్బందులను తగ్గిస్తుంది. మొబైల్‌లోనే అన్ని వివరాలు కనిపిస్తాయి. సమయం, శ్రమ ఆదా అవుతాయి.'టీ?రేషన్' యాప్ లో అన్ని ముఖ్య సమాచారం తెలుగు భాషలో లభిస్తుంది, కాబట్టి గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్యులకు కూడా అర్థమవుతుంది. మీ రేషన్ కార్డు యాక్టివ్‌గా ఉందా లేదా సస్పెండెడ్‌గా ఉందా అనేది తక్షణం తెలుసుకోవచ్చు. కార్డు ఆధార్‌తో సరిగ్గా లింక్ అయిందా లేదా పెండింగ్‌లో ఉందా అని తిరిగి చూడవచ్చు. మీ రేషన్ డీలర్ సంప్రదింపు నంబర్, షాప్ అడ్రస్, లొకేషన్ మ్యాప్‌తో కలిపి చూడొచ్చు. నెలవారీ రేషన్ కోటా, ఇప్పటివరకు ఎంత సరుక్కు (బియ్యం, చనా దాలు మొదలైనవి) పొందారో, మిగిలిన మొత్తం అంతా క్లియర్‌గా కనిపిస్తాయి. మునుపటి నెలల డ్రా వివరాలు, కొత్త అప్‌డేట్‌ల గుర్తింపు నోటిఫికేషన్లు. ఈ ఫీచర్లు ఈ కేవైసీ ప్రక్రియలతో ముడిపడి ఉంటాయి, కాబట్టి డేటా కచ్చితంగా ఉంటుంది.యాప్‌ను ఉపయోగించడం చాలా సులభం. గూగుల్ ప్లే స్టోర్‌లో 'టీ?రేషన్' టైప్ చేసి శోధించండి. అధికారిక యాప్‌ను ఫ్రీగా ఇన్‌స్టాల్ చేయండి. మొదటిసారి ఓపెన్ చేసినప్పుడు మీ రేషన్ కార్డు నంబర్ లేదా రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ చేయండి. మొబైల్‌కు వచ్చే ఓటీపీ ఎంటర్ చేసి వెరిఫై చేయండి. లాగిన్ అయిన తర్వాత మెయిన్ స్క్రీన్‌లో అన్ని వివరాలు కనిపిస్తాయి.

మెనూల ద్వారా స్పెసిఫిక్ సెక్షన్లకు వెళ్లవచ్చు. అండ్రాయిడ్, ఐఓఎ రెండింటిలోనూ త్వరలో అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఇంటర్నెట్ లేకపోతే ఆఫ్‌లైన్ మోడ్‌లో కూడా కొన్ని ఫీచర్లు పనిచేస్తాయి.ఈ యాప్ రేషన్ వ్యవస్థలో పారదర్శకతను బలోపేతం చేస్తుంది. లబ్ధిదారులు తమ కోటాను పూర్తిగా పొందుతున్నారా అని తనిఖీ చేసుకోవచ్చు, డీలర్లపై దెబ్బ తీస్తుంది.

ప్రభుత్వం లక్ష్యం పీడీఎస్(పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్)ను డిజిటల్‌గా మార్చడం. ఇది మహిళలు, రోజువారీ కూలీలు, గ్రామీణ ప్రజలకు మరింత సహాయకరం. ఏదైనా సమస్యలు ఉంటే యాప్‌లోనే ఫిర్యాదు చేయవచ్చు.తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్‌లో ముందంజలో ఉంది. ఇటీవల మీసేవా వాట్సాప్ ఆప్ ద్వారా సర్వీసులు ఆర్డర్ చేయడం, యూరియా యాప్ ద్వారా ఎరువులు ట్రాక్ చేయడం అందుబాటులోకి వచ్చాయి. 'టీ?రేషన్' కూడా ఇలాంటి డిజిటల్ పరివర్తనలో భాగం.

# ఏఐ దాహం తీర్చతరమా?



## విలువైన నీటి వనరులను కోల్పోతున్న భూమి

## డాటా సెంటర్లకు భారీగా నీటి వినియోగం అవసరం

వాషింగ్టన్: కృత్రిమ మేధ (ఏఐ) మన జీవితాల్లో భాగంగా అల్లుకుపోతున్నది. చాట్‌బాట్స్ నుంచి ట్రక్లైమేట్ మోడల్స్ వరకు మనకు సేవలందిస్తున్నాయి. వీటి కోసం భౌతిక సదుపాయాలు విస్తరిస్తున్నాయి. ఈ ఏఐ బూమ్‌తోపాటు నీటికి కూడా డిమాండ్ పెరుగుతున్నది. ఇప్పటి వరకు ఈ రంగం వినియోగించే విద్యుత్తు గురించి మాత్రమే చర్చ జరుగుతున్నది. కానీ పరిశోధకుల అధ్యయనం లో ఈ రంగం తాజా నీటిని అత్యధికంగా వినియోగించుకుంటున్నదని వెల్లడైంది. కరువుకాటకాలు, వర్షపాతం కొరత వల్ల నీటి కోసం సమస్యను ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో భారత్ కూడా ఉంది. చాట్‌జీపీ టీ, గూగుల్ జెమినీ వంటి ఏఐ సిస్టమ్స్‌కు సంబంధించిన డాటా సెంటర్లు అత్యధిక నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో ఉన్నాయి. ఏఐకి అంత దాహం ఎందుకు?: సర్వర్లతో కూడిన భారీ డాటా సెంటర్లపై ఏఐ మోడల్స్ ఆధారపడతాయి. ఈ సర్వర్లు నిరంతరం, అన్ని వేళలా పని చేస్తాయి. ఉష్ణాన్ని విడుదల చేస్తాయి. కాబట్టి వాటిని చల్లబరచవలసి ఉంటుంది. అత్యధిక కూలింగ్ సిస్టమ్స్ ఇప్పటి కీ భారీగా తాజా నీటిపైనే ఆధారపడుతున్నాయి. ఈ విధంగా ఉపయోగించిన నీటిలో చాలా వరకు ఆవిరిగా మారిపోతుంది లేదా వ్యర్థ జలంగా మారుతుంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 45 శాతం డాటా సెంటర్లు నదీ తీర ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఈ ప్రాం తాలు ఇప్పటికే నీటి లభ్యత విషయంలో తీవ్రమైన సమస్యను ఎదుర్కొంటున్నాయి. కేవలం అమెరికాలోని డాటా సెంటర్లు 2023లో 6,600 కోట్ల లీటర్ల నీటిని వినియోగిం చుకున్నా యి. నీటికి సంబంధించిన ఆందోళన డాటా సెంటర్లు ప్రత్యక్షంగా వినియోగించుకునే నీటికి మాత్రమే పరిమితం కాదు, విద్యుత్తు ఉత్పత్తి కోసం పరోక్షంగా వినియోగించుకునే నీటి విషయంలో కూడా ఆందోళన ఉంది. 100 పదాలకు ఓ సీసా నీరు వినియోగం: ప్రపంచ వ్యాప్తంగా ఏఐ పెట్టుబడులు పెరుగుతున్న తరుణంలో ఈ అధ్యయన నివేదిక వచ్చింది. 100 పదాల ఏఐ ప్రాంప్ట్ కోసం దాదాపు ఒక సీసా నీరు ఖర్చవుతుందని శాస్త్రవేత్తలు చెప్పారు. భారత్, చైనా, స్పెయిన్, జర్మనీ వంటి దేశాల్లో డాటా సెంటర్ల సామర్థ్యం పెరుగుదలకు నీటి లభ్యత సమస్య ఎదురవుతుందని ఈ నివేదిక తెలిపింది. భారత దేశంలో నీటి సమస్య పెరుగుతుండటం వాస్తవం, అదే సమయంలో ఏఐ కోసం డిమాండ్, ప్రజాదరణ కూడా పెరుగుతున్నాయి.

# గన్నవరంలో వంశీకి కలిసొచ్చేనా?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** గన్నవరం రాజకీయాలు మళ్లీ గరం గరంగా మారనున్నాయి. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తిరిగి గన్నవరం పాలిటిక్స్ లో యాక్టివ్ అయ్యారు. దాదాపు రెండేళ్ల పాటు గన్నవరం రాజకీయాలకు దూరంగా ఉన్న వల్లభనేని వంశీ తాజాగా ఇప్పుడు తిరిగి తన పట్టును నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వల్లభనేని వంశీ తిరిగి యాక్టివ్ కావడంతో అక్కడ వైసీపీ కార్యక్రమాలు కూడా ఊపందుకున్నాయి. గన్నవరం నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వల్లభనేని వంశీ గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తర్వాత కొన్ని నెలల పాటు జైల్లో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వల్లభనేని వంశీ రూపు రేఖలు కూడా జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత మారిపోయాయి.ఇప్పటికీ అదే రకంగా వల్లభనేని వంశీ మెయిన్ టెయిన్ చేస్తున్నారు. గతంలో యువకుడిగా కనిపిస్తూ, జట్టుకు రంగు వేసుకుని కనిపించే వల్లభనేని వంశీ గత కొద్ది రోజుల నుంచి మాత్రం తెల్లజుట్టు, బక్కపలచగానే ఉన్నారు. అది కేవలం సెంటిమెంట్ తోనే వంశీ జనంలోకి వెళ్లి సింపతీని పొందాలనుకుంటున్నట్లుంది. అందుకే ఆయన తన రూపు రేఖలను మార్చుకునే ప్రయత్నంచేయడం లేదు. వల్లభనేని వంశీని గతంలో,ఇప్పుడు చూసిన వారికి పాపం.. అనిపించేలా వంశీ ఉండటం ఆయనకు కలసి వచ్చే అంశమని చెబుతున్నారు. జైల్లో 140 రోజుల పాటు ఉన్న వల్లభనేని వంశీ తెల్ల జుట్టుతో పాటు అనేక ఆరోగ్య పరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వచ్చే ఎన్నికల వరకూ ఇదే రకంగా మెయిన్ టెయిన్ చేసి తిరిగి గెలుపొందేలా ప్లాన్ చేసుకున్నారని



తెలిసింది.వల్లభనేని వంశీ ఇటీవల వరసగా అనేక వివాహ వేడుకలకు హాజరయ్యారు. అక్కడ టీడీపీ నేతలను కూడా పలుకరించడం, ఆత్మీయంగా దగ్గరకు తీసుకోవడం చర్చనీయాంశ మైంది.

వివాహ వేడుకలలో మాత్రమే కాకుండా అనేక కార్యక్రమాలకు కూడా ఆయన హాజరవుతున్నారు. గన్నవరం నియోజకవర్గంలో వల్లభనేని వంశీ విస్తృతంగా పర్యటిస్తున్నారు. వైసీపీ కార్యకర్తలకు ధైర్యం చెబుతున్నారు. తాను ఎక్కడకూ వెళ్లనని, ఇక్కడే ఉండి రాజకీయాలను కొనసాగిస్తానని చెబుతున్నారు. తనపై పదకొండు కేసులు నమోదయ్యాయని, ఇంతకు మించి ఏం చేస్తారన్న ధీమా వల్లభనేని వంశీలో స్పష్టంగా కనిపిస్తుంది. గన్నవరం టీడీపీలో నెలకొన్న అసంతృప్తులను సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

## ఫిట్ ఇండియా మిషన్ ద్వారా యావతకు క్రీడలు, ఆరోగ్యం పై చైతన్యం

**జయశంకర్ భూపాలపల్లిహైదరాబాద్,తెలంగాణ దిశ :** ఫిట్ ఇండియా మిషన్ పిలుపు మేరకు "సండేస్ ఆన్ బైస్కిల్" కార్యక్రమాల ద్వారా యువతను క్రీడల వైపు ఆకర్షించి, ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి చిర్రా రఘు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక డా. బి.ఆర్. అంబేద్కర్ క్రీడా మైదానం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు బైస్కిల్ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో యువత, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ఆరోగ్యకర జీవనశైలి ప్రాధాన్యతపై ప్రజలకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా చిర్రా రఘు మాట్లాడుతూ,

రోజువారీ జీవితంలో సైక్లింగ్‌ను అలవాటుగా మార్చుకోవడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరూ ఫిట్ ఇండియా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ యువతను క్రీడల పట్ల ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది శివసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రజాపాలనలో పల్లెలను ఆదర్శ గ్రామాలుగా తీర్చి దిద్దుతాం- వొడితెల ప్రణవ్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** కాంగ్రెస్ ప్రజాపాలనలో పల్లెలను ఆదర్శ గ్రామాలుగా తీర్చి దిద్దుతామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ హామీ ఇచ్చారు. హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల గ్రామాల్లో నూతనంగా కొలువుదిరిన గ్రామ పంచాయతీల పాలకవర్గ నూతన ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లా డుతూ.. గ్రామాల్లో నెలకున్న సమస్యలకు, వాటి పరిష్కారానికి వారధి గా గ్రామ సర్పంచుల పాలన కొనసాగించాలని ప్రణవ్ కోరారు.

గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాల ని, సమస్యలపై ఈ ప్రాంత బిడ్డగా తన దృష్టికి తీసుకొస్తే మంత్రుల దృష్టికి తీసుకెళ్లి ఎక్కువ నిధులు కేటాయిస్తామని తెలిపారు.



# భారీగా వీసాల రిజెక్ట్...



న్యూఢిల్లీ, : అగ్రరాజ్యం అమెరికా వెళ్లాలి.. డాలర్లు సంపాదించాలి అనేది ఒకప్పుడు సంపన్నుల కల.. కానీ ఇప్పుడు మధ్య తరగతి వారు కూడా అమెరికా వెళ్తున్నారు. అయితే డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక సీన్ మారిపోయింది. వీసా ఆంక్షలు, నిబంధనలతో అమెరికా వెళ్లేందుకు చాలా మంది వెనుకాడుతున్నారు. అయితే ట్రంప్ రాకముందు కూడా పరిస్థితి ఇలాగే ఉంది. 2024లో ప్రపంచ దేశాలకు చెందిన చాలా వీసాలు తిరస్కరణకు గురయ్యాయి. 2024లో అమెరికా బీ1/బీ2 వీసాలు (బిజినెస్, టూరిజం) తిరస్కార రేట్లు ప్రపంచవ్యాప్తంగా భిన్నంగా ఉన్నాయి. లైచెన్‌స్టీన్, మోనాకో వంటి దేశాల్లో 0%తోపాటు, భారత్ 16.32%తో మధ్యస్థ స్థాయిలో ఉంది. ఈ డేటా ఆర్థిక స్థితి, రాజకీయ సంబంధాలు, ఇమ్మిగ్రేషన్ రిస్క్‌లపై ఆధారపడి ఉంది.చాలా అధిక ఆదాయ దేశాలు తక్కువ తిరస్కారాలు ఎదుర్కొన్నాయి. ఇవి స్థిరమైన ఆర్థిక వ్యవస్థలు, తక్కువ ఇమ్మిగ్రేషన్ రిస్క్ కలిగి ఉన్నాయి. తక్కువ ఆదాయ దేశాల వీసాలు ఎక్కువగా తిరస్కరణకు గురయ్యాయి. లైచెన్‌స్టీన్, మొనాకో, నార్త్ కొరియా కు చెందిన ఒక్క వీసా కూడా ఆమోదం పొందలేదు. యూఏఈ 1.46 శాతం, జపాన్ 5.76 శాతం, సౌదీ అరేబియా 7.89 శాతం వీసాలు తిరస్కరణకు గురయ్యాయి.భారత్ 16.32%తో 18వ స్థానంలో ఉంది. యూరప్ దేశాలు (ఫ్రాన్స్ 8.50%, జర్మనీ 10. 02%) కంటే ఎక్కువ కానీ చైనా (25.37%), పాకిస్తాన్ (45.65%) కంటే మెరుగు. భారతీయుల్లో ఐటీ ప్రొఫెషనల్స్, విద్యార్థులు ఎక్కువగా అప్లై చేస్తున్నారు. డాక్యుమెంట్లు, ఆర్థిక నిరూపణలు బలంగా ఉంటే సక్సెస్ రేటు పెరుగుతుంది. సంఘర్షణలు, పేదరికం, ఇమ్మిగ్రేషన్ చరిత్ర కారణంగా కొన్ని దేశాల్లో 50% మించి తిరస్కారాలు జరిగాయి. ఇరాన్ 55.54 శాతం, కెనడా 56.35 శాతం, ఆఫ్ఘనిస్తాన్ 48.89 శాతం, నైజీరియా 46.51 శాతం, పాకిస్తాన్ 45.65 శాతం వీసాలు తిరస్కరణకు గురయ్యాయి. కెనడా వంటి అధిక ఆదాయ దేశం కూడా అధిక రేటు ఉండటం ఆశ్చర్యకరం హెచ్?1బీ వీసాలపై యూఎస్‌కు వెళ్లి బీ1/బీ2 అప్లై చేసే ట్రెండ్ కారణం.వీసా ఇస్తే అమెరికాలోనే స్థిరపడతారనే అనుమానం(భారత్, చైనా వంటి దేశాల్లో ఎక్కువ). ఉద్యోగం, ఆదాయం నిరూణ లేకపోవడం, అసంపూర్ణ పత్రాలు, పారికార్డులు, యుద్ధాలు, అస్తిరణ(ఆఫ్ఘాన్, ఇరాన్) తదితర కారణాలతో అమెరికా వీసాలు తిరస్కరిస్తోంది. స్విట్జర్లాండ్, సింగపూర్ వంటి దేశాలు తక్కువ రేట్లు కలిగి ఉంటే, భారతీయులు బలమైన టైస్ (ఫ్యామిలీ, జాబ్) చూపించాలి.ఈ డేటా అమెరికా వీసా పాలసీల ప్రపంచ డైనమిక్స్‌ను తెలియజేస్తుంది. భారత్ మెరుగైన స్థానంలో ఉన్నప్పటికీ, మరింత చైతన్యం అవసరం.

# వైసీపీలో ఆ ఇద్దరూ ఔట్!



**తిరుపతి,తెలంగాణ దిశ :** సాధారణంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో అవకాశాలు చాలా ఈజీగా వస్తాయి. అంతే సులువుగా వదిలించుకుంటారు కూడా. ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకమే. ఎవరి సిఫారసులతో పని ఉండదు. ఎవరి సిఫారసులు అక్కడ పని చేయవు. ఆయనకు ఇష్టం అయితే అందలం ఎక్కిస్తారు. ఇష్టం లేకపోతే వారితో నష్టం అని తెలిసిన పట్టించుకోరు. తన నిర్ణయం తాను తీసుకుంటారు. అయితే వాడుకున్నంత కాలం పార్టీ కోసం వాడుకుంటారు. తరువాత నిర్మొహమాటంగా చెప్పేస్తారు. ఇప్పుడు ఓ ఇద్దరు మహిళ నేతల విషయంలో కూడా జగన్మోహన్ రెడ్డి అదే అభిప్రాయానికి వచ్చారు. వచ్చే ఎన్నికల్లో మాజీ మంత్రి రోజాకు టికెట్ లేదు అని తేల్చేసారట. మరో మాజీ మంత్రి విడదల రజినీకి అయితే వేరే నియోజకవర్గానికి షిఫ్ట్ అయితేనే సీటు అని కండిషన్ పెట్టారట. అయితే ఆమె ప్లేస్ లో కొత్తగా పార్టీలోకి వచ్చిన యాంకర్ శ్యామలను రంగంలోకి దించుతారని ప్రచారం నడుస్తోంది.నగిరి లో రోజా పరిస్థితి బాగాలేదు. ఆమెను దింపిన ప్రయోజనం లేదు. అందుకే జగన్మోహన్ రెడ్డి వేరే ఆలోచనకు వచ్చారు. పార్టీ కోసం పని చెయ్.. అధికారంలోకి వచ్చాక చూద్దాం అన్నట్టు ఆమెను సముదాయించినట్లు ప్రచారం నడుస్తోంది. పైగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆమె విషయంలో సానుకూలంగా. ఒక్క భూమన కరుణాకర్ రెడ్డి మాత్రం సానుకూలంగా ఉన్నారు. అయితే రోజా కోసం సిఫార్సు చేసే అంతటి పరిస్థితి ఆయనలో కనిపించడం లేదు. త్వరలో నగరికి కొత్త ఇన్చార్జిని ప్రకటించే అవకాశం ఉంది. అది జరిగితే రోజా ఏదో ఒక నిర్ణయం తీసుకుంటారు. అయితే ఇప్పటికే ఆమెకు కొంత సంకేతాలు అందాయి. అందుకే ఆమె పార్టీకి దూరంగా ఉంటున్నారు. తమిళ చిత్రసీమలో అవకాశాలు వెతుక్కుంటున్నారు. ఎందుకంటే గత అనుభవాల దృష్ట్యా తెలుగు చిత్ర పరిశ్రమలో ఆశించిన స్థాయిలో అవకాశాలు లేవు. తమిళనాడులో అయితే అటు చిత్ర పరిశ్రమతో పాటు కొత్తగా విజయ్ పార్టీ ఏర్పాటు చేయడంతో.. ఆ పార్టీలో చేరి రాజకీయాలు చేసుకోవచ్చని రోజా భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే నగిరి కి కొత్త ఇన్చార్జి వస్తే కానీ దీనిపై క్లారిటీ రాదు.వైసీపీ అధికార ప్రతినిధిగా ఉన్నారు యాంకర్ శ్యామల హైదరాబాదులో ఉంటూ ఆమె వైసీపీ రాజకీయాలు చేస్తున్నారు. అయితే ఆమెను ఏపీకి తెచ్చి చిలకలూరిపేట ఇన్చార్జ్ చేసేందుకు జగన్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. మరి అదే జరిగితే రజని పరిస్థితి ఏంటి అనేది ఒక ప్రశ్న. అయితే ఇప్పటికే విడదల రజనీకి రేపల్లె వెళ్ళమన్నారట జగన్. ఎన్నికలకు ముందు గుంటూరు పంపించి ఆమెను రాజకీయంగా బలిపశువు చేశారు. ఇప్పుడు చిలకలూరిపేట వస్తానంటే అడ్డుపడుతున్నారు. రేపల్లె వెళ్ళమంటున్నారు. అక్కడ అనగాని సత్య ప్రసాద్ గట్టి నాయకుడిగా ఉన్నారు.

మంత్రిగా తన మార్కు చూపుతున్నారు. అక్కడికి వెళ్తే తట్టుకోలేనని రజిని ఆందోళన చెందుతున్నారు. ఉంటే చిలకలూరిపేటలో ఉండి రాజకీయం చేస్తా.. లేకపోతే వేరే పార్టీలో చేరుతానని ఆమె వైసీపీకి లీకులు ఇస్తున్నారు. అయితే జగన్మోహన్ రెడ్డి ఆమె విషయంలో సానుకూలంగా లేరు. ఆమెతోపాటు రోజాను వదిలించుకుంటే మంచిదన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. యాంకర్ శ్యామల అయితే పవన్ కళ్యాణ్ పై పంచ్ డైలాగులతో రెచ్చిపోతున్నారు. అందుకే ఆమెకు ఒక ఛాన్స్ ఇద్దామని రజినీకి పొగ పెడుతున్నారు. కొద్ది రోజుల్లో ఆ ఇద్దరు మాజీ మంత్రుల భవితవ్యం ఉంది. మొత్తానికి యాంకర్ శ్యామల తన కెరీర్ వదులుకున్నారు కానీ.. ఆమె కెరీర్ కు ఇప్పుడు జగన్ అండగా నిలుస్తున్నారు.

# నీట్-పీజీ 2025 కౌన్సెలింగ్ షెడ్యూలు విడుదల

ఢిల్లీ,:దేశవ్యాప్తంగా నీట్ పీజీ-2025 అడ్మిషన్లకు సంబంధించిన ఆల్ ఇండియా కోటా (ఏఐక్యూ), స్టేట్ కోటా కౌన్సెలింగ్ షెడ్యూల్ను నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) విడుదల చేసింది. ఈ షెడ్యూల్ను అన్ని రాష్ట్ర వైద్య విద్య శాఖలు, కౌన్సెలింగ్ సంస్థలు, మెడికల్ కాలేజీలు తప్పనిసరిగా పాటించాలని ఎన్ఎంసీ ఆదేశించింది. మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ (ఎంసీసీ) విడుదల చేసిన షెడ్యూల్ను ఏ రాష్ట్రం కూడా మార్చకూడదని కోరింది. అలా చేస్తే ఏఐక్యూ-స్టేట్ కౌన్సెలింగ్ల మధ్య సమన్వయ లోపం వల్ల విద్యార్థులకు నష్టం జరిగే అవకాశం ఉన్నట్లు ఎన్ఎంసీ స్పష్టం చేసింది. కాగా... తెలంగాణలో నీట్-పీజీ కౌన్సిలింగ్ ప్రక్రియ ఆలస్యం అయిన నేపథ్యంలో ఫేజ్-1 కౌన్సెలింగ్లో సీట్లు పొందిన అభ్యర్థులకు రిపోర్టింగ్ గడువును కాళోజీ యూనివర్సిటీ పొడిగించిన సంగతి తెలిసిందే. చివరి తేదీని ఈ నెల 18 నుంచి ఈ నెల 21 వరకు పొడిగిస్తున్నట్లు కేఎన్ఆర్యూహెచ్ఎస్ స్పష్టం చేసింది.

అన్ని సెలవులు కూడా వర్కింగ్ డేస్గానే : కౌన్సెలింగ్ సమయం తక్కువగా ఉన్నందున శనివారాలు, ఆదివారాలు, గెజిటెడ్ సెలవులు కూడా వర్కింగ్ డేస్గా పరిగణించి కౌన్సెలింగ్ పనులు కొనసాగించాలని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. రాష్ట్రాలు- ఎంసీసీతో డేటా పంచుకోవాలని ఎన్ఎంసీ సూచించింది. ఏఐక్యూ, స్టేట్ కౌన్సెలింగ్లలో ఒకే సీటుపై డబుల్ అలాట్మెంట్ కాకుండా ఉండేందుకు, రాష్ట్రాల డీఎంఈలు జాయిన్ అయిన విద్యార్థుల డేటాను ఎంసీసీకి రౌండ్ల వారీగా సమర్పించాలని ఎన్ఎంసీ కోరింది. సంబంధిత కాలేజీలు, అధికారులు, విద్యార్థులు ఈ షెడ్యూల్ను కచ్చితంగా పాటించాలని సూచించింది.ఎన్ఎంసీ విడుదల చేసిన కౌన్సెలింగ్ కీలక తేదీలు: 1 వ దశ కౌన్సెలింగ్: అక్టోబర్ 17- నవంబర్ 22, 2025 1వ దశ జాయినింగ్ చివరి తేదీ: డిసెంబర్ 1, 2025? 2వ రౌండ్ కౌన్సెలింగ్: డిసెంబర్ 5- డిసెంబర్ 12, 2025? 3వ రౌండ్: డిసెంబర్ 26, 2025 - జనవరి 2, 2026? స్ట్రే వెకెన్సీ రౌండ్: జనవరి 15 - జనవరి 21, 2026? అన్ని రౌండ్ల జాయినింగ్ చివరి తేదీ: జనవరి 31, 2026? , 2025 నుంచి అకాడెమిక్ సెషన్ ప్రారంభం

## కౌటాల సర్పంచ్ నక్క శంకర్‌కు ఘన సన్మానం

### అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

**కొమురం,తెలంగాణ దిశ :** కౌటాల మండల కేంద్రంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ నక్క శంకర్, ఉప సర్పంచ్ డబ్బా గోపాల్తో పాటు వార్డు సభ్యులను మాజీ శాసనసభ్యులు కోనేరు కోనప్ప సన్మానించారు.

మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో భేదాభిప్రాయాలను పక్కనపెట్టి అందరినీ కలుపుకొని గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ, మౌలిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

పెట్టాలని కోరారు.తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కౌటాల మండల కేంద్రంలో సుమారు 90 శాతం రోడ్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. గెలుపొందిన ప్రజాప్రతినిధులు మిగతా సమస్యల పరిష్కారానికి కృషి చేసి ప్రజాసంక్షేమానికి అంకితమవ్వాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పొలిటికల్ లీడర్స్ ను లైట్ గా తీసుకున్న మెస్సీ!

న్యూఢిల్లీ :మనదేశంలో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు ఏదైనా చేయగలరు. ఎవరినైనా తమ వద్దకు తీసుకు రాగలరు. వారితో ఎలాంటి పనైనా చేయగలరు. చేయించగలరు. ముకేశ్ అంబానీ తన కుమారుడి పెళ్లి కోసం హాలీవుడ్ సింగర్లను సైతం ముంబై తీసుకొచ్చారు. వారితో పాటలు పాడించారు. డాన్సులు కూడా వేయించారు. ఇది కేవలం ఉదాహరణ మాత్రమే. ఇలాంటివి మన దేశంలో చాలా జరిగాయి.. జరుగుతూనే ఉన్నాయి.గోట్ టూర్ ఆఫ్ ఇండియా లో భాగంగా అర్జెంటీనా ఫుట్బాల్ ఆటగాడు మెస్సి మనదేశంలోకి వచ్చాడు. కోల్ కతా, హైదరాబాద్, ముంబై నగరాలలో పర్యటించాడు. కోల్ కతా ప్రాంతంలో నిర్వహించిన మెస్సి టూర్ నవ్వుల పాలైంది.. సరైన నిర్వహణ ఏర్పాట్లు లేకపోవడంతో ప్రేక్షకులు మైదానంలో బీభత్సం సృష్టించారు. మెస్సి ని చూడలేకపోయామనే బాధతో రణరంగం సృష్టించారు.వాస్తవానికి కోల్కతా ఘటనను దృష్టిలో పెట్టుకున్న హైదరాబాద్ పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంతరాలు చోటు చేసుకోకుండా మెస్సి టూర్ సాగే విధంగా భద్రత కల్పించారు. మెస్సీ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా ఫుట్బాల్ ఆడారు. ఆయనను సత్కరించారు. తన మనవడి తో ఫోటోలు కూడా దిగే అవకాశాన్ని పొందారు. హైదరాబాద్ మాత్రమే కాదు ముంబై నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో కూడా మెస్సి తో ఫోటోలు దిగడానికి రాజకీయ నాయకులు పోటీపడ్డారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మెస్సి రాకను చూసి పరవశించిపోయారు.గోట్ టూర్ ఆఫ్ ఇండియాలో మెస్సీ అనేక రకాలుగా సందడి చేశాడు. ఫుట్బాల్ ఆడాడు. అయితే అతడు భారతదేశంలో పర్యటించిన దృశ్యాలకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నాడు ఈ అర్జెంటీనా ఆటగాడు. ఈ వీడియోలో రేవంత్ రెడ్డి లేడు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి అంతకంటే లేడు. ఆ వీడియోలో కొంతమంది చిన్నారులు ఉన్నారు. ఆ చిన్నారుల తర్వాత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ ఉన్నాడు. ముంబైలో పర్యటించినప్పుడు సచిన్ టెండూల్కర్ ద్వారా ఒక జెర్సీని మెస్సి పొందాడు. సచిన్ తో కొంతసేపు మాట్లాడాడు. అతడితో అనేక విషయాలను పంచుకున్నాడు..వాస్తవానికి మెస్సీ టూర్ కోసం రాజకీయ నాయకులు ఎంతో గొప్పగా ఏర్పాట్లు చేశారు. పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. స్పాన్సర్లను వెతికి మరి రకరకాల ప్రయత్నాలు చేశారు. విపక్షాల నుంచి మాటల దాడి ఎదురైనప్పటికీ పకడ్బందీగా తిప్పికొట్టారు.. కానీ మెస్సీ మాత్రం రాజకీయ నాయకులను ఏమాత్రం పట్టించుకోలేదు. ఆ సందర్భంలో పలకరించాడు అంతే. తనకు తప్పదు కాబట్టి కొద్దిసేపు మైదానం నటించాడు. కానీ అతని మనసులో ఉన్నది ముమ్మాటికి క్రీడా స్ఫూర్తి. అందువల్లే సచిన్ ఉన్న దృశ్యాలకు సంబంధించిన వీడియో మాత్రమే అతడు సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు.. డబ్బున్న శ్రీమంతుడు గుర్తుపెట్టుకోవాల్సింది ఒకటే.. వారు తాత్కాలిక ఆధిపత్యాన్ని మాత్రమే సాధించగలరు.. డబ్బులు వెదజల్లి కొంతసేపు ఆ సౌఖ్యాన్ని అనుభవించగలరు. కానీ నిజమైన స్ఫూర్తిని ఎప్పటికీ కొనుగోలు చేయలేరని మెస్సి ఈ వీడియో ద్వారా నిరూపించాడు.

# కాషాయంగా మారుతున్న అరుణం

కేరళలో భారతీయ జనతా పార్టీ వికసించడం ప్రారంభించింది. భారతీయ జనతా పార్టీకి ఇప్పుడు ఓ సీఎం ఫేస్ కూడా రెడీగా ఉన్నారు . కాకపోతే ఆ ఫేస్ ఇంకా కాంగ్రెస్‌లోనే ఉన్నారు. కానీ బీజేపీతో దగ్గరగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నా లేనట్లేగానే వ్యవహరిస్తున్నారు. ఆయనే శశిథరూర్. రాష్ట్రాల్లో అధికారంలోకి రావాలంటే.. ముఖ్యంగా ఎదుగుతున్న పార్టీకి ఓ బలమైన నాయకత్వం కావాలి. కేరళలో ఇప్పటి వరకూ అలాంటి నాయకత్వాన్ని బీజేపీ పలుమార్లు టెస్ట్ చేసింది. రాజీవ్ చంద్రశేఖర్, సురేష్ గోపి సహా చాలా మందిని ప్రయత్నించింది. ఏదీ వర్కవుట్ కాలేదు. కానీ శశిథరూర్ మాత్రం అందరి కంటే బెస్ట్ ఆప్షన్ అవుతారుకేరళలో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు పాలకవర్గం సిపిఎం నేతృత్వం లోని ఎల్‌డిఎఫ్‌కు, విపక్ష కాంగ్రెస్ సారథ్యంలోని యుడిఎఫ్‌కు గట్టి షాక్ ఇచ్చాయి. చివరకు కేరళ రాజకీయ తెరపై 'కమలం' విరిసింది. రానున్న ఏప్రిల్ మే నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి కూడా అధికారం చేపట్టేలా ఈ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ప్రేరణ కలిగిస్తాయని ఎంతో కలలుగన్న ఎల్‌డిఎఫ్‌కు తీవ్ర ఆశాభంగం తప్పలేదు. గ్రామ పంచాయతీలు, బ్లాక్ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ నేతృత్వం లోని విపక్షానికే చోటు లభించడం అనూహ్య పరిణామం. 14 జిల్లా పంచాయతీల్లో ఒక్కో ఫ్రంట్ చెరి సమాన సంఖ్యలో సీట్లు దక్కించుకున్నాయి. గత రెండు దశాబ్దాలుగా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో ప్రజలను ప్రభావితం చేయడంలో పాలకవర్గం ఎల్‌డిఎఫ్ రికార్డు నెలకొల్పినప్పటికీ, ఈసారి దశాబ్ద కాలంగా అధికారంలో లేని యుడిఎఫ్ పైనే ఓటర్లు సానుభూతి చూపించడం ప్రత్యేకంగా గమనించవలసి ఉంది. ప్రతి ఐదేళ్లకు ప్రభుత్వం మారే 50 ఏళ్ల సంప్రదాయాన్ని 2021 లో ఎల్‌డిఎఫ్ ఛేదించినా, ఈసారి ప్రభుత్వంపై వ్యతిరేకత ఎక్కువగానే కనిపించింది. శబరిమల అయ్యప్ప క్షేత్రంలోని బంగారు ఆభరణాల చోరీ, ఆలయ యాజమాన్య బోర్డు ప్రెసిడెంట్ అయిన సిపిఎం నాయకుని అరెస్టు, ఆయనపై తదుపరి చర్య తీసుకోవడానికి అధికార పార్టీ సిపిఎం అంగీకరించకపోవడం ఇవన్నీ అయ్యప్ప భక్తులకే కాదు, ప్రజలకు కూడా తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. ఈ విషయం లో అలసత్వం చూపిస్తే తీవ్ర పరిణామాలుంటాయని యుడిఎఫ్ హెచ్చరించింది కూడా. ఇక కాంగ్రెస్ నేతృత్వం లోని యుడిఫ్ విషయానికి వస్తే యువజన కాంగ్రెస్ శాసనసభ్యునిపై అత్యాచార కేసులు ఉన్నప్పటికీ, స్థానిక విజయం అసెంబ్లీ ఎన్నికల ముందు యుడిఎఫ్‌ను మరింత బలోపేతం చేసిందని చెప్పవచ్చు. కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలున్నాయి. కానీ వాటి గురించి ప్రజలు పట్టించుకోలేదు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వమే ఆ సమస్యను పరిష్కరించుకుంటుందని విడిచిపెట్టి యుడిఎఫ్‌కే పట్టం కట్టారు. దీన్ని గమనించి పార్టీలోని అంతర్గత కుమ్ములాటల చిక్కుముడులను అధిష్ఠాన వర్గం ముందు పరిష్కరించక తప్పదు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారో ఎప్పటికప్పుడు పరిశీలించి, ఆమేరకు స్థానిక నాయకత్వాన్ని పటిష్టపర్చాలి. ప్రజల్లో పార్టీపై నమ్మకం పెంచాలి. ఈ విజయావకాశాన్ని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమకు తిరిగి ప్రజలు పట్టం కట్టేలా కాంగ్రెస్ నేతృత్వం లోని యుడిఎఫ్ గట్టిగా నిర్మాణాత్మక కృషి సాగిస్తేనే కొంతవరకు నెగ్గుకు రాగలుగుతుంది. తిరువనంతపురం కార్పొరేషన్‌లో ఘన విజయం సాధించిన ఎన్‌డిఎ కూటమి కార్పొరేషన్ పాలనా పగ్గాలు చేపట్టడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది.. తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో 45 ఏళ్లుగా ఎల్‌డిఎఫ్ పాలనే కొనసాగుతోంది. ఈసారి మొత్తం 101 వార్డుల్లో 50 వార్డులను బిజెపి (ఎన్‌డిఎ) గెల్చుకుంది. ఎల్‌డిఎఫ్‌కు 29 వార్డులు, యుడిఎఫ్‌కు 19 వార్డులు మాత్రమే దక్కాయి. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ఇంకా చాలా కాలం ఉన్నప్పటికీ తిరువనంతపురం లోక్‌సభ నియోజకవర్గం లోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈసారి గెలుపొందడానికి బిజెపి వ్యూహాలు రూపొందిస్తోంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ ఎల్‌డిఎఫ్ 99, విపక్షం యుడిఎఫ్ 41 స్థానాలు గెల్చుకోగా, త్రిస్సూర్ స్థానాన్ని ఎన్‌డిఎ దక్కించుకుంది. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్‌డిఎ థర్డ్ ఫ్రంట్‌గా అవతరించకుండా ఉంటే స్థానిక సంస్థల విజయాలపై యుడిఎఫ్ మరింత ఉత్సాహంగా ఉండేది. రాష్ట్రంలో ఎక్కువగా ద్విపార్శ్వ సంకీర్ణ పోటీలు జరుగుతున్నాయి. ఈ పార్టీలు ఏ సమయంలో ఎటువైపు మొగ్గు చూపుతాయో చెప్పడం కష్టం. ఈ నేపథ్యంలో మూడవ ఫ్రంట్‌గా ఎన్‌డిఎ కూటమి అవతరించడం మిగతా పార్టీలన్నిటికీ గందరగోళంగా మారే పరిస్థితి ఏర్పడుతుంది. దేశంలోనే ఏకైక వామపక్ష పాలక రాష్ట్రంగా కేవలం తన వ్యక్తిత్వంతో ఆదర్శాన్ని పినరయి విజయన్ ప్రదర్శించారు. ఇప్పుడు ఓటు వాటాల పరంగా వారి ఉనికితో సంబంధం లేకుండా ఎల్‌డిఎఫ్ ఓడిపోవడం వామపక్ష పార్టీలను ఓ మూలకు నెట్టేసినట్టే అవుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి సురేష్ గోపీ త్రిస్సూర్ లోక్‌సభ స్థానం నుంచి 74,686 ఓట్ల మెజార్టీతో చారిత్రాత్మక విజయం సాధించారు. బిజెపి ఏకైక ఎంపీగా నిలిచారు. ఈ విజయం కేరళ రాజకీయాల్లో త్రిముఖ పోటీకి నాంది పలికిందని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి విజయావకాశాలు మెండుగా ఉంటాయని కాషాయ నాథులు అంచనా వేశారు. కానీ లోక్‌సభ ఎన్నికల ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై ఏమాత్రం పడలేదు. కమలనాథుల అంచనాలన్నీ తలకిందులయ్యాయి. 2020 నుంచి త్రిస్సూర్ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు బిజెపికి తప్పుడు సంకేతాలనే అందిస్తున్నాయి. ఆనాడు త్రిస్సూర్ అసెంబ్లీలో బిజెపి 6, ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ చెరో 24 స్థానాలను సాధించుకున్నాయి. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో త్రిస్సూ ర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఇలాంటి ఫలితాలు రాకూడదని పార్టీలు అనుకుంటున్నాయి. ఏదేమైనా సిపిఎం పట్టు సడలి అరుణ కిరణాలు మసకబారుతున్నాయా? అన్నప్రశ్న ఎదురవుతోంది.స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన విజయాలతో బీజేపీ అసెంబ్లీ ఎన్నికల్లో బలంగా పోటీ పడటం ఖాయంగా కనిపిస్తోంది. 2026లోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అధికార లెఫ్ట్ డెమెక్రటిక్ ఫ్రంట్ తన ఓటు బ్యాంకును బీజేపీకి కోల్పోతోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్..స్థానిక ఎన్నికల్లో అత్యధిక విజయాలు సాధించింది. ఇదే ట్రెండ్ కొనసాగితే.. ముక్కోణపు పోటీ జరుగుతుంది. అప్పుడు ముఖ్యమంత్రి అభ్యర్థులే కీలకం అవుతారు. శశిథరూర్ ..బీజేపీ సీఎం ఫేస్ గా నిలబడితే.. అదో అడ్వాంటేజ్ అయ్యే అవకాశాలు ఉంటాయి.

## అనంతలో టీడీపీ వర్సెస్ బీజేపీ

అనంతపురం, : అనంతపురం జిల్లాలోని రాయదుర్గంలో టీడీపీ, బీజేపీల మధ్య రాజకీయ యుద్ధం జరుగుతుంది. బీజేపీ నేత కాపు రామచంద్రారెడ్డి ముందస్తు వ్యూహంతో వెళుతున్నట్లే కనిపిస్తుంది. బీజేపీలో ఉన్నప్పటికీ ఆయన మనసంతా వైసీపీలో ఉన్నట్లే కనిపిస్తుంది. రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి బీజేపీలో చేరారు. అయితే ఆయన వ్యవహారశైలిని చూస్తుంటే బీజేపీలో ఎక్కువ రోజులు ఉండేటట్లు కనిపించడం లేదు. తన మైనింగ్ వ్యవహారాలను కాపాడుకోవడానికే బీజేపీలో చేరారని టీడీపీ ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు వంటి వారు విమర్శిస్తున్నారు. ఆయన అక్రమంగా గనులను తవ్వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఇటీవల టీడీపీ నేతలు ఆందోళనకు కూడా దిగారు. కానీ కాపు రామచంద్రారెడ్డి మాత్రం వైసీపీలో ఉన్నవారందరికీ బీజేపీ కండువాలను కప్పుతున్నారు.కాపు రామచంద్రారెడ్డి రాయదుర్గం నియోజకవర్గం నుంచి మూడు సార్లు గెలుపొందారు. 2009లో గెలిచిన కాపు 2012లో జరిగిన ఉపఎన్నికలలో గెలుపొందారు. తిరిగి 2019 లో గెలిచారు. రాయదుర్గం నుంచి గెలుస్తూ వస్తున్న కాపు రామచంద్రారెడ్డికి గత ఎన్నికల్ల వైఎస్ జగన్ టిక్కెట్ ఇవ్వలేదు. దీంతో కాపు రామచంద్రారెడ్డి బీజేపీలో చేరారు. కానీ బీజేపీలో చేరినప్పటికీ అక్కడ కూటమి నేతలకు మధ్య పొసగడం లేదు. టీడీపీ వర్సెస్ బీజేపీగా రాయదుర్గం నియోజకవర్గంలో నడుస్తుంది. వైసీపీ ఇక్కడ కొంత సైలెంట్ గా ఉన్నప్పటికీ ప్రధానంగా బీజేపీ, టీడీపీ ల మధ్య వైరం కొనసాగుతున్నట్లు కనిపిస్తుంది. కాల్వ శ్రీనివాసులు, కాపు రామచంద్రారెడ్డి లు గత కొన్ని ఎన్నికల్లో వేర్వేరు పార్టీల నుంచి పోటీ చేయడంతో కూటమి పార్టీలో ఉన్న సయోధ్య కుదరలేదు.ఇక్కడ కూటమి తరుపున ఏ కార్యక్రమం జరిగినప్పటికీ టీడీపీ, బీజేపీ లు ఎడమొఖం,పెడముఖంలానే ఉన్నాయి.

ప్రభుత్వ కార్యక్రమాల్లో టీడీపీ నేతలతో పాటు బీజేపీ నేతలు పాల్గొనడం లేదు. అయితే కాపు రామచంద్రారెడ్డి కేవలం తన గనుల తవ్వకాల కోసమే తాత్కాలికంగా బీజేపీ పంచన చేరారని, ఎన్నికలకు ముందు తిరిగి వైసీపీలోకి వెళ్లడం ఖాయమని టీడీపీ నేతలు చెబుతున్నారు. అటువంటి నేతకు ఎందుకు ప్రాధాన్యత ఇస్తున్నారని కొందరు టీడీపీ నేతలు బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయినా బీజేపీ నేతలు మాత్రం పట్టించుకోకపోవడంతో రాయదుర్గం నియోజకవర్గంలో టీడీపీ వర్సెస్ బీజేపీ అన్న రీతిలోనే కార్యక్రమాలు సాగుతున్నాయి. బీజేపీ నేత కాపు రామచంద్రారెడ్డి కి వ్యతిరేకంగా టీడీపీ నేతలు నిరసన ప్రదర్శనలు కూడా చేస్తుండం రాయదుర్గం నియోజకవర్గం ప్రత్యేకత.

# వెట్రిమారన్ తెలుగు సామ్రాజ్యం

## ఎన్టీఆర్ వాయిస్‌తో ప్రోమో విడుదల



తమిళ దర్శకులలో వెట్రిమారన్ ది ఓ ప్రత్యేక శైలి. బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలిచి, వారి సమస్యలను తెరకెక్కించడంలో వెట్రిమారన్ దిట్ట. అంతేకాదు... వేరే దర్శకులతోనూ ఇలాంటి కథలనే సినిమాలుగా నిర్మించిన వ్యక్తి వెట్రిమారన్. తెలుగులోని స్టార్ దర్శకులతో సినిమాలు చేయాలని ఆయన కొంతకాలంగా అనుకుంటున్నారు. కానీ ఏ ప్రాజెక్ట్ కూడా సెట్ కావడం లేదు. ఎన్టీఆర్ తోనూ వెట్రిమారన్ సినిమా చేస్తే బాగుంటుందని భావిస్తున్న అభిమానులు చాలా మందే ఉన్నారు. ఆ మధ్య సూర్య హీరోగా వెట్రిమారన్ ఓ సినిమా చేస్తాడని వార్తలు వచ్చాయి. కానీ ఆ మూవీ అనివార్య కారణాలతో ఆగిపోవడం తో ఇప్పుడు శింబుతో 'అరసన్' మూవీని చేస్తున్నాడు వెట్రిమారన్. ఈ సినిమా తెలుగు వర్షన్ కు ఎన్టీఆర్ సైతం తన గొంతుతో చేయూతనివ్వబో తున్నాడు. శిలంబరసన్, వెట్రిమారన్ కాంబోలో తెరకెక్కుతున్న 'అరసన్'ను తెలుగులో 'సామ్రాజ్యం' పేరుతో డబ్ చేస్తున్నారు. దీని ప్రోమో శుక్రవారం ఉదయం ఎన్టీఆర్ వాయిస్ ఓవర్‌తో రాబోతోంది. ఈ మధ్య ఎన్టీఆర్ 'కింగ్ డమ్' మూవీకి వా యిస్ ఓవర్ అందించాడు. ఆ సినిమాను హిందీలో 'సామ్రాజ్య' పేరుతో డబ్ చేశారు.

ఇప్పుడు 'అరసన్' మూవీని తెలుగులో 'సామ్రాజ్యం'గా డబ్ చేయడం, దాని ప్రోమోకు ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇవ్వడం విశేషం. మొత్తానికి 'సామ్రాజ్యం' అనే టైటిల్ కు ఎన్టీఆర్ కు ఏదో అవినాభావ సంబంధం ఉన్నట్టుగా అనిపిస్తోంది. ఈ సినిమాను సీనియర్ నిర్మాత థాను ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ కు, హీరో శింబుకు మధ్య కూడా మంచి అనుబంధం ఉంది. బేసికల్ గా మంచి సింగర్ అయిన శింబు తెలుగు సినిమాల్లో కొన్ని పాటలు పాడాడు. అందులో ఎన్టీఆర్ 'బాద్ షా' మూవీ కూడా ఒకటి. ఇటు దర్శకుడు, అటు కథానాయకుడు ఇద్దరితో ఉన్న అనుబంధం కారణంగా 'సామ్రాజ్యం' ప్రోమోకు ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇచ్చాడని అంటున్నారు.

# దేశంలోనే పెద్ద రైల్వేస్టేషన్..



అమరావ: చంద్రబాబు సీఎంగా ఉంటే అంతే.. భారీ ప్రాజెక్టులు.. కొత్త కొత్త రంగాలు.. పరిశ్రమల, పెట్టుబడులు.. దీనికైతే కొదవ ఉండదు. విజనరీ అని అందుకే అంటారు. ముందుగానే ఆలోచించుకొని చంద్రబాబు చేస్తోన్న ఈ పనులు ఏపీ రూపురేఖలే మార్చబోతున్నాయి. ఇప్పటికే విశాఖలో గూగుల్ డేటా సెంటర్ తో ఏఐ హబ్ ను ఏర్పాటు చేయబోతున్న చంద్రబాబు ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద రైల్వే స్టేషన్ ను కేంద్రం సాయంతో ఏపీలో నెలకొల్పబో తుండడంతో మన అందరికీ గర్వకారణంగా మారింది.. భారత రైల్వే చరిత్రలో ఒక నూతన అధ్యాయం రూపుదిద్దుకుంటోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి సమీపంలో దేశంలోనే అతిపెద్ద రైల్వే స్టేషన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర అభివృద్ధి దిశలో ఇది ఒక కీలకమైన మైలురాయిగా భావిస్తున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక రైల్వే స్టేషన్ డిజైన్ అమెరికాలోని న్యూయార్క్ గ్రాండ్ సెంట్రల్ టెర్మినల్, లండన్ సెయింట్ పాంక్రాస్ వంటి ప్రపంచ ప్రసిద్ధ కేంద్రాల నమూనాలో రూపొందించబడుతోంది. ఎయిర్‌పోర్ట్ తరహాలో అత్యాధునిక టెర్మినల్స్, సౌకర్యాలతో స్థాపించనున్న ఈ స్టేషన్ సుమారు 1,500 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబడనుంది. మొత్తం 24 ప్లాట్‌ఫామ్స్, 4 టెర్మినల్స్ ఉండగా, రోజుకు దాదాపు 3 లక్షల ప్రయాణికులు ఈ స్టేషన్ ద్వారా రాకపోకలు సాగించే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 2,245 కోట్లు కేటాయించింది. రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణలో భాగంగా 57 కిలోమీటర్ల బ్రాడ్ గేజ్ లైన్, అలాగే 3.2 కిలోమీటర్ల మేర కృష్ణా నదిపై కొత్త బ్రిడ్జ్ నిర్మాణం ప్రణాళికలో ఉంది.

చెన్నై, కోల్కతా, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రధాన మెట్రో నగరాలతో నేరుగా రైల్వే లింకులు ఏర్పాటు చేయడం ద్వారా అమరావతి దేశవ్యాప్తంగా కీలక ట్రాన్సిట్ హబ్‌గా ఎదగనుంది. రాజధాని ప్రాంతంలో ఏర్పడనున్న ఈ ప్రాజెక్టు 2–3 సంవత్సరాల్లో పూర్తి కానుంది. రానున్న కాలంలో ఈ కొత్త రైల్వే స్టేషన్ ప్రాంతీయ రవాణా, వ్యాపార వృద్ధి, ఉపాధి అవకాశాలకు గణనీయమైన ఉత్సాహాన్ని అందిస్తుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల ఏర్పాటు ద్వారా అమరావతి నగరం దేశంలోని ఆధునిక రైల్వే నెట్‌వర్క్‌లో ఒక కీలక కేంద్రంగా రూపుదిద్దుకోనుందనే విశ్లేషణ నిపుణులది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్టు, సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన "విశ్వ స్థాయి నగరం అమరావతి" స్వప్నానికి కొత్త ఊపు తీసుకురానుంది. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇది ఒక చారిత్రాత్మక మౌలిక సదుపాయాల బహుమతిగా నిలిచిపోనుంది.

# ఏపీకి గేమ్ ఛేంజర్.. ఏఐ హబ్

విశాఖపట్టణం, : నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం మరోసారి జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. ఢిల్లీలో జరిగిన "భారత్ ఏఐ శక్తి" కార్యక్రమంలో ఆయనకు లభించిన గౌరవం, ప్రశంసలు.. గూగుల్–రైడెన్ ఒప్పందం ద్వారా విశాఖపట్నంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ స్థాపన.. ఇవన్నీ కలిపి ఆంధ్రప్రదేశ్‌కు చారిత్రాత్మక మలుపును సూచిస్తున్నాయి. ఐటీ రంగంలో చంద్రబాబు నాయుడుకున్న దూరదృష్టి మరోసారి నిరూపితమైంది. గతంలో హైదరాబాద్‌ను ఐటీ రాజధానిగా తీర్చిదిద్దిన ఆయన, ఇప్పుడు విశాఖపట్నాన్ని ఏఐ రాజధానిగా మలచే దిశగా బలమైన అడుగులు వేశారు. మైక్రోసాఫ్ట్‌ను హైదరాబాద్‌కు తీసుకురావడంలో చూపిన అసాధారణమైన దార్శనికత, ఇప్పుడు గూగుల్ ఏఐ డేటా సెంటర్‌ను విశాఖకు తీసుకురావడంలో స్పష్టంగా ప్రతిఫలించింది. ఏఐ హబ్: ఈ ఒప్పందం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ఏఐ, డేటా సెంటర్లఅభివృద్ధికి బలమైనపునాది పడుతోంది. "భారత్ ఏఐ శక్తి" కార్యక్రమంలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్విని వైష్ణవ్‌లు చంద్రబాబు నాయకత్వాన్ని ప్రశంసించడం, ఆయనకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును ఇచ్చింది. ఢిల్లీ వేదిక చంద్రబాబుకు ఒక కీర్తి పీఠంగా మారింది. తెలుగు నేతకు జాతీయ స్థాయిలో లభించిన ఈ అరుదైన గౌరవం, ఆయన అనుభవానికి, విజన్‌కు నిదర్శనం. దేశ భవిష్యత్తు కోసం సాంకేతిక రంగంలో ఆయనకున్న విజన్ మరియు నిబద్ధతను కేంద్ర మంత్రులు కొనియాడారు. నారా లోకేష్ వ్యాఖ్యల ప్రకారం, విశాఖలో స్థాపించబోయే ఈ ఏఐ హబ్ ద్వారా రాష్ట్రానికి బృహత్తర ప్రయోజనాలు చేకూరనున్నాయి. వేల సంఖ్యలో కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించబడతాయి, ముఖ్యంగా యువతకు. ప్రపంచ స్థాయి ఆవిష్కరణలకు.. సాంకేతిక అభివృద్ధికి రాష్ట్రం కేంద్రంగా మారుతుంది. రాష్ట్రంలోని యువతకు ప్రపంచ స్థాయిప్రమాణాలతో కూడినఅవకాశాలు లభించనున్నాయి. ఇది రాష్ట్ర భవిష్యత్తుకుబలమైన బాట. ఈ ఒప్పందం చంద్రబాబునాయకత్వాన్ని తిరిగి జాతీయచర్చకు తీసుకురావడమే కాకుండా, రాష్ట్రానికి పెట్టుబడులు.. అభివృద్ధిని ఆకర్షించడంలోకీలకపాత్ర పోషిస్తుంది. రాజకీయంగా ఆయనకు మళ్లీ జాతీయ స్థాయిలో ప్రాధాన్యతను కలిగించే ఘట్టంగా ఇది నిలుస్తోంది. చంద్రబా బు నాయుడు భవిష్యత్తును ఆలోచించే నేతగా మరోసారి నిరూపించుకున్నారు. విశాఖలో ఏఐ హబ్ స్థాపన మరియు ఢిల్లీ వేదికపై ఆయనకు లభించిన 'కింగ్ సైజ్' ఎలివేషన్? ఇవన్నీ కలిపి ఆంధ్రప్రదేశ్‌ను దేశ సాంకేతిక పటంలో గేమ్ చేంజర్‌గా మార్చే దిశగా సాగుతున్నాయి. ఇది తెలుగు ప్రజలకు మరియు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు గర్వించదగిన ఘట్టం.

# 'వేదం 2'పై డైరెక్టర్ క్రిష్ కీలక వ్యాఖ్యలు..!



2010లో డైరెక్టర్ క్రిష్ తెరకెక్కించిన క్లాసిక్ ఫిల్మ్ 'వేదం' ప్రేక్షకుల మనసుల్లో ఎంతగా నిలిచిపోయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అల్లు అర్జున్, మంచు మనోజ్, అనుష్క లు ముఖ్య పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి అప్పట్లో మిక్స్‌డ్ రెస్పాన్స్ వచ్చినా, కాలక్రమంలో అది ఒక కల్ట్ క్లాసిక్‌గా మారింది. ఈ సినిమాలోని పాత్రలు హీరోల కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాయి. అయితే ఈ సినిమాకు సీక్వెల్ రాదని అందరూ భావించారు. ఎందుకంటే సినిమా క్లైమాక్స్‌లో బన్ని (కబీర్) మరియు మనోజ్ (విజయ్) పాత్రలు మరణిస్తాయి. కానీ తాజాగా, డైరెక్టర్ క్రిష్ ఇచ్చిన ఇంటర్వ్యూలో వేదం 2 గురించి ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. అనుష్క ప్రధాన పాత్రలో రూపొందుతున్న ఘాటి సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ మీడియా ఇంటర్వ్యూలో క్రిష్ మాట్లాడుతూ.. "వేదం క్లైమాక్స్‌లో అనుష్క ట్రైన్ ఎక్కుతుంది. బయట వర్షం పడుతుంది. జీవితం మీద ఆశ ఉంది అన్నట్టు ముగింపు ఉంటుంది. అయితే అప్పుడే సరోజ పాత్రకి సీక్వెల్ ప్లాన్ చేయాలని అనుకున్నాను. తిలక్ గారు రాసిన 'ఊరి చివర ఇల్లు' అనే నవలలో 'రమ' అనే వేశ్య పాత్ర నన్ను చాలా ఆకట్టుకుంది. దాన్ని ప్రేరణగా తీసుకుని, సరోజ పాత్ర ఆధారంగా ఓ గొప్ప లవ్ స్టోరీ రాసాను. అనుష్కకు కథ చెప్పగానే ఆమె చాలా ఇష్టపడింది. అప్పటి నుంచి ఎప్పుడూ అడుగుతుంటుంది – 'సరోజ సినిమా ఎప్పుడు?' అని. కానీ దానికి సరైన సమయం కావాలి." క్రిష్ వ్యాఖ్యల ద్వారా స్పష్టంగా అర్థమవుతోంది – ఈసారి 'వేదం 2' ఒక డైరెక్ట్ సీక్వెల్ కాకపోయినా, అనుష్క పోషించిన "సరోజ" పాత్ర ఆధారంగా కొత్త కథగా తెరకెక్కనుంది. అదే 'సరోజ' అనే టైటిల్‌తో వచ్చే అవకాశం ఎక్కువ. ఈ సినిమాలో అనుష్క మళ్లీ వేశ్య పాత్రలో నటిస్తుండగా, కథ మొత్తం ఒక ఇంటెన్స్ లవ్ స్టోరీగా మలచబడనుందన్న విషయం కూడా ఆయన చెప్పిన మాటల ద్వారా తెలుస్తోంది. ఇప్పుడు అసలైన ప్రశ్న.. ఈ సరోజ కథ ఎప్పుడు తెరపైకి వస్తుంది? అనేది.


# సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తాం

## – ట్రస్ట్ అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్




పెద్దపల్లి :యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ మరోసారి తమ దాతృత్వాన్ని చాటుకుంది. పెద్దపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఎలాంటి వేతనం లేకుండా స్వచ్ఛందం గా సేవలందిస్తున్న నలుగురు వాలంటీర్లకు గౌరవ వేతనం అందించే కార్యక్రమం గురువా రం నిర్వహించారు. వారి అంకితభావాన్ని గుర్తించిన ట్రస్ట్ ఒక్కొక్కరికి రూ. 4,500 చొప్పున మొత్తం రూ. 18వేల ఆర్థిక సహాయం అందించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జెడ్పిటిసి గంట రాములు యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్ హాజరయ్యారు. వాలంటీర్ల సేవలను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సంద ర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్ మాట్లాడు తూ ప్రజా సేవలో వాలంటీర్లు చూపుతున్న అంకితభావం నిజంగా ప్రశంసనీయమని కొనియాడారు. సమాజానికి నిస్వార్థంగా సేవ చేస్తున్న వారికి తోడుగా నిలబడడం మనందరి బాధ్యత అన్నారు. వారి సేవలకు ప్రోత్సాహంగానే ఈ చిన్న సహాయాన్ని అందిం చామని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా సేవా కార్య క్రమాలను మరింత విస్తృతం గా, ముఖ్యంగా ఆరోగ్య, విద్యా రంగాల్లో కొనసాగించే సంక ల్పాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సహకరించి న గంట రాములు యాదవ్, మేకల మల్లేశం యాదవ్ తో పాటు సందనవేని రాజేందర్ యాదవ్, గొడుగు రాజకుమార్ యాదవ్ లకు ట్రస్ట్ తరపున ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గొడుగు రాజ్ కుమార్ యాదవ్, ట్రస్టీలు బత్తిని లక్ష్మణ్ యాదవ్, మేకల కొమురయ్య యాదవ్, మల్లె త్తుల నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రష్మిక మరో బిగ్ స్టెప్..



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న కెరీర్ లో ఇప్పుడు ఓ రేంజ్ లో దూసుకుపోతుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. వరుస సినిమాల్లో నటిస్తున్న అమ్మడు.. అదే సమయంలో హిట్స్ కూడా అలాగే అందుకుంటోంది. బ్లాక్ బస్టర్ సినిమాలతో అందరినీ మెప్పిస్తున్న రష్మిక.. మరిన్ని సినిమాల్లో ఛాన్స్ లు సొంతం చేసుకుని సత్తా చాటుతోంది. మొత్తానికి మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా బిజీగా ఉన్న ఆమె.. షూటింగ్స్ తో తీరిక లేకుండా గడుపుతుందనే చెప్పాలి. ఇప్పుడు సౌత్ టు నార్త్.. అనేక ఆఫర్స్ ఆమె చేతిలోనే ఉన్నాయి. అలా తక్కువ టైమ్ లో ఎక్కువ డబ్బులు సంపాదిస్తున్నట్లే ఉంది. అదే సమయంలో ఇప్పుడు రష్మిక మందన్న వ్యాపార రంగంలోకి అడుగుపెట్టింది. ఆ విషయాన్ని ఆమెనే చెబుతూ పోస్ట్ చేసిన వీడియోస్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. తొలుత ఓ వీడియో షేర్ చేస్తూ.. "నేను చివరకు దీన్ని రికార్డ్ చేస్తున్నానని నేను నమ్మలేకపోతున్నాను. మీకు ఇప్పటికే తెలిసినట్లుగా, నేను నా హృదయానికి చాలా దగ్గరగా ఉన్న దానిపై పని చేస్తున్నాను" అంటూ చెప్పుకొచ్చింది. "మీరు దానిని అనుభవిస్తారని నేను ఆశిస్తున్నాను, మీరు దానినిఇష్టపడతారని నేను ఆశిస్తున్నాను. దానినిమీతో పంచుకోవడానికి వేచి ఉండలేను. చాలా చాలా చాలా ఉత్సాహంగా ఉన్నాను. ఆందోళనగా ఉన్నాను. కృతజ్ఞతతో ఉన్నాను" అని చెప్పిన రష్మిక.. ఆ తర్వాత తన తల్లితో జరిగిన సంభాషణ వీడియోను పోస్ట్ చేసింది. అందులో రష్మిక "నేను ఇప్పుడు చాలాముఖ్యమైన షూట్‌కువెళ్తున్నాను. మీరు చెప్పిన వ్యాపారాన్ని నేను ప్రారంభిస్తాను" అని తల్లితో చెప్పగా.. ఆమె బెస్ట్ విషెస్ చెబుతారు. అయితే రష్మిక ఏ బిజినెస్ స్టార్ట్ చేయనుందో వెల్లడించలేదు. ప్రస్తుతం ఆమెకు సోషల్ మీడియాలో బెస్ట్ విషెస్ వెల్లువెత్తుతున్నాయి.

# సాదా బైనామా ప్రక్రియ వేగవంతం



హైదరాబాద్,: తెలంగాణలో తెల్లకాగితాలపై జరిగిన భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియ మళ్లీ ఊపందుకుంది. 2014కు ముందు జరిగిన ఒప్పందాలకు అధికారిక గుర్తింపు లభించనుంది. అయితే పూర్తి ఆధారాలు లేకపోవడం, విక్రేతల అభ్యంతరాలు, ధరల డిమాండ్ వంటి సవాళ్లను రెవెన్యూ అధికారులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో తెల్లకాగితాలపై ( సాదాబైనామా ) జరిగిన భూ కొనుగోళ్లను క్రమబద్ధీకరించే ప్రక్రియ మళ్లీ ఊపందుకుంది. దశాబ్దాలుగా పెద్దల సమక్షంలో కొనుగోలు చేసిన భూములకు అధికారిక గుర్తింపు లభిస్తుండటంతో లక్షలాది మంది రైతులు, వారి కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అయితే సుదీర్ఘ కాలం క్రితం జరిగిన ఈ లావాదేవీలకు సంబంధించి పూర్తిస్థాయి ఆధారాలు చూపడంలో రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లు ఇప్పుడు రెవెన్యూ అధికారుల క్షేత్రస్థాయి విచారణను అత్యంత కీలకంగా మార్చాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 లక్షల ఎకరాలకు సాదాబైనామా ఒప్పందాలు జరిగినట్లు అంచనా. ప్రభుత్వం 2020 అక్టోబరు నుంచి నవంబరు వరకు దరఖాస్తులను స్వీకరించగా.. 8.90 లక్షల అర్జీలు వచ్చాయి. అదే ఏడాది ఆర్వోఆర్–1971 చట్టం రద్దు కావడంతో న్యాయ వివాదం కారణంగా దరఖాస్తుల పరిశీలన నిలిచిపోయింది. ఈ ఏడాది ఆగస్టులో హైకోర్టు దరఖాస్తుల పరిశీలనకు, క్రమబద్ధీకరణకు అనుమతి ఇవ్వడంతో ఈ ప్రక్రియకు మోక్షం లభించింది. ప్రస్తుతం ఆర్వోఆర్ 2025 చట్టం ప్రకారం క్రమబద్ధీకరణ ప్రక్రియ జరుగుతోంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215